ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 02 సంచిక -314 పేజీలు - 8 వెల - 03/- ఆదివారం 1 మార్చి 2026

## బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు





23 మంది మృతి..

- కాకినాడ సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్ కేంద్రంలో భారీ పేలుడు
- ఘటనా స్థలంలోనే 20 మంది దుర్మరణం
- పేలుడు ధాటికి పొలాల్లోకి ఎగిరిపడ్డ మృతదేహాలు
- ఐదు కిలోమీటర్ల మేర వినిపించిన భారీ శబ్దం
- తీవ్రతకు పక్క గ్రామంలోని స్కూల్ స్లాబ్ కు పగుళ్లు



కాకినాడలో జరిగిన ఘోర బాణసంచా పేలుడు ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించిన ఆయన, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సీఎం.. మృతుల కుటుంబాలకు రూ. 20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా తన వంతుగా రూ. 2 లక్షల సాయం అందించిందని తెలిపారు.

మిగతా 2లో.

## సర్వైకల్ క్యాన్సర్‌పై సమరం..




**దేశవ్యాప్త హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభించిన ప్రధాని మోదీ**

**14 ఏళ్లు పైబడిన బాలికల కోసం దేశవ్యాప్త హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభం**

**రాజస్థాన్‌లో పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శంకుస్థాపన**

అజ్మీర్ **ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్.**
సర్వైకల్ క్యాన్సర్‌పై ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్త పోరాటానికి శ్రీకారం చుట్టారు. మహిళల్లో క్యాన్సర్ మరణాలకు ప్రధాన కారణాల్లో ఒకటైన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నిర్మూలించే లక్ష్యంతో 14 ఏళ్లు పైబడిన బాలికల కోసం రూపొందించిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని

మిగతా 2లో.



## యుద్ధం ముంగిట రెండు దేశాలు

**ఇరాన్ పై ఇజ్రాయెల్ దాడి..**

**భారీ పేలుళ్లతో దద్దరిల్లిన టెహ్రాన్..**

**ఖమేనీ కార్యాలయం సమీపంలోనే క్షిపణి దాడులు!**

**వీధులను కమ్మేసిన దట్టమైన పొగ**

**ప్రాణభయంతో రోడ్లపైకి పరుగులు తీసిన జనం**

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు శనివారం నాటికి పరాకాష్ఠకు చేరాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్ పై ఇజ్రాయెల్ వాయుసేన 'ముందస్తు దాడులు' చేసింది. దీంతో నగరం అతలాకుతలమైంది. వరుస పేలుళ్ల ధాటికి టెహ్రాన్ వీధులు దట్టమైన నల్లటి పొగతో నిండిపోయాయి. అంతర్జాతీయ మీడియా నివేదికల ప్రకారం.

మిగతా 2లో.

## ఎకనామిక్ హబ్‌గా ఉత్తరాంధ్ర

**: బ్లూ జెట్ హెల్త్ కేర్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేశ్**

**అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.2,300 కోట్ల పెట్టుబడితో బ్లూ జెట్ హెల్త్ కేర్ పరిశ్రమ ఏర్పాటు**

**ఉత్తరాంధ్ర పారిశ్రామికాభివృద్ధిలో ఇది కీలక మైలురాయిగా అభివర్ణించిన మంత్రి లోకేశ్**



అనకాపల్లి **ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్.**
ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రస్థానంలో మరో కీలక అడుగు పడింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం సీతపాలెం ఇండస్ట్రియల్ పార్క్‌లో ప్రముఖ ఫార్మా దిగ్గజం 'బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్' (బీజేహెచ్ఎల్) గ్రీన్‌ఫీల్డ్ ఔషధ తయారీ యూనిట్‌కు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన

మిగతా 2లో.

## సిఎస్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన జి.సాయిప్రసాద్

అమరావతి **ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్.**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా జి.సాయి ప్రసాద్ శనివారం ఎపి సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సిఎస్ గా పని చేసిన కె.విజయానంద్ శనివారం పదవీ విరమణ చేస్తుండడంతో ఆయన నుండి సాయి ప్రసాద్ సిఎస్ గా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా తిరుమల తిరుపతి దేవస్థానం మరియు విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానాల వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ప్రత్యేక పూజా

మిగతా 2లో.



## 99 రోజుల యాక్షన్ ప్లాన్

**అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం**

**కాకినాడ ఘటనపై రేవంత్ దిగ్భ్రాంతి**



2లో.

## విద్య, భద్రత, భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం

**రూ.120 కోట్లతో అత్యాధునిక టెక్నాలజీతో వంటశాల**

**టీటీడీపై అసత్య పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు**

**రూ.5,456.26 కోట్ల బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం**

తిరుమల **ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్.**
టీటీడీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.5,456.26 కోట్ల బ్జడెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపిందని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ బడ్జెట్‌కు ఆమోదం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఈవో ఎం.రవిచంద్రతో కలసి శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో టీటీడీ బోర్డు సబ్ కమిటీ

మిగతా 2లో.



## క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యంగా అడుగులు

**15 ఏళ్లలోపు బాలికలకు ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ షురూ**

**ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు కీలక హామీ**

**వైద్య రంగానికి బడ్జెట్‌లో 6 శాతంతో నిధుల వెల్లువ**

**గత ప్రభుత్వంలో తిరుమల పవిత్రతకూ భంగం కలిగించారంటూ ఫైర్**

విజయనగరం **ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్.**
రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని జోడు గుర్రాల్లా పరుగులు పెట్టిస్తున్నామని, ప్రజారోగ్యానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావివలసలో శనివారం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడుతూ... క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు.

మిగతా 2లో.




# బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

కాకినాడ, **ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్.**

కాకినాడ జిల్లా వేట్లపాలెంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 23కు చేరింది. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. మరో 9మంది తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు.అయితే, వేట్లపాలెంలో బాణసంచా ప్రమాద స్థలిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వాహనంలో వేట్లపాలెం చేరుకున్నారు. బాణసంచా పేలుడు బాధిత కుటుంబాలను పరామర్శించారు. పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. పేలుడు ఘటన తీరును అధికారులు సీఎంకి వివరించారు. ఈ ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం చంద్రబాబు, బాధితులకు అవసరమైన అన్ని సహాయాలు అందిస్తామని మాటిచ్చారు. అలాగే మృతుల కుటుంబాల పిల్లల విద్య బాధ్యతను పూర్తిగా ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. వారి చదువు పూర్తయ్యే వరకు అవసరమైన అన్ని ఖర్చులనూ భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు ఎంత ఖర్చయినా మెరుగైన వైద్యం అందిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. ఆర్డీవో, డీఎస్పీ, అగ్నిమాపక శాఖాధికారి, కార్మిక శాఖ అధికారులను సస్పెండ్ చేసినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. బాధ్యతల నిర్వహణలో విఫలమైన వారిపై మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రమాదానికి కారణమైన బాణసంచా వ్యాపారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. వారి ఆస్తులను జప్తు చేసి బాధితులకు అందజేస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. గత ఏడాది కొమరపాలెంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటన తర్వాత ప్రభుత్వం ఒక ప్రత్యేక పాలసీ రూపొందించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఆ పాలసీని పూర్తిగా అమలు చేసి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయం అందించడమే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. బాధితుల పట్ల ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.సిఎం వెంట హోంమంత్రి అనిత, బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఉన్నారు.

## బాణసంచా ప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

**మృతులు కుటుంబాలకు 2లక్షల పరిహారం ప్రకటన**



కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 పరిహారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

## వేట్లపాలెం ఘటనపై డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి

**బాధితులకు పూర్తి అండగా ఉంటామని ప్రకటన**

కాకినాడ జిల్లాలో ఓ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడులో 23 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన సమయంలో 30 మంది కార్మికులు బాణసంచా కేంద్రంలో ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన ఆయన విడుదల చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా కల్పించారు. ఈ దురదృష్టకర ఘటన గురించి తెలియగానే కాకినాడ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నానని అన్నారు. కాకినాడ కలెక్టర్, ఎస్పీ ఘటన స్థలంలో ఉండి పరిస్థితిని, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని చెప్పుకొచ్చారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించే ఏర్పాట్లు చేశారని తెలిపారు. బాణాసంచా తయారీ పరిశ్రమ నుంచి ఇంకా పేలుళ్లు వస్తున్నాయని అధికారులు తెలిపారన్నారు. ఈ పేలుళ్లకు కారణాలపై విచారణ చేస్తున్నామని అన్నారు. బాణాసంచా పరిశ్రమలపై అధికారులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచి భద్రత చర్యలను తనిఖీ చేయాలని జిల్లా అధికారులను ఆదేశించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. పరిసర గ్రామాలకు పొగ అలుముకున్న క్రమంలో ఆయా గ్రామాల ప్రజలకు ధైర్యం చెప్పి, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మంత్రి కందుల దుర్గేశ్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లను ఘటన స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని దిశానిర్దేశర చేశానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.



## పేలుడు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

**మృతుల కుటుంబాలకు అండగా నిలవాలని ప్రభుత్వానికి సూచన**

కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న భారీ పేలుడు ఘటనపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పందించారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన విచారాన్ని తెలియజేశారు.

ప్రమాదంలో కార్మికులు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇటువంటి విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అలాగే, ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం ప్రకటించాలని జగన్ డిమాండ్ చేశారు. పేలుడు ధాటికి గాయపడిన వారికి వెంటనే మెరుగైన వైద్య సహాయం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

# ఎకనామిక్ హబ్‌గా ఉత్తరాంధ్ర

**మొదటిపేజీ తరువాయి**

సభలో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్ర పారిశ్రామికాభివృద్ధిలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, పరిశ్రమలు క్షేత్రస్థాయిలో ఏర్పాటయ్యేలా (గ్రౌండింగ్) తమ ప్రభుత్వం శ్రద్ధ వహిస్తోందని స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడిదారులు తమ గమ్యస్థానంగా ఎంచుకోవడానికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయని లోకేశ్ విశ్లేషించారు.

మొదటిది 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'. ప్రభుత్వంతో ఒప్పందం కుదిరిన మరుక్షణం నుంచి ఆ ప్రాజెక్టును ప్రభుత్వం తమ సొంత ప్రాజెక్టుగా భావిస్తుందని, పెట్టుబడిదారులను బయటివారిలా కాకుండా అభివృద్ధిలో భాగస్వాములుగా చూస్తామని చెప్పారు.

రెండవది 'విశ్వసనీయత'. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న నమ్మకమే రాష్ట్రానికి అతిపెద్ద బలమని, ఏపీ ప్రభుత్వం మాట ఇస్తే తప్పక నిలబెట్టుకుంటుందన్న భరోసా పెట్టుబడిదారుల్లో ఉందని అన్నారు.మూడవది 'డబుల్ ఇంజిన్ సర్కార్'. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న బలమైన నాయకత్వం వల్ల నిర్ణయాలు వేగంగా జరుగుతున్నాయని, ప్రాజెక్టులు కాగితాలకే పరిమితం కాకుండా శరవేగంగా కార్యరూపం దాలుస్తున్నాయని మంత్రి వివరించారు.

**ఒక సంభాషణ నుంచి సాకారమైన ప్రాజెక్ట్**

ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న ఆసక్తికరమైన నేపథ్యాన్ని మంత్రి వివరించారు. తన సొంత నియోజకవర్గం మంగళగిరికి చెందిన బ్లూ జెట్ సంస్థ సీనియర్ అధికారి వేణుబాబు గతేడాది తనను కలిసినప్పుడు, ఏపీలో ఎందుకు పెట్టుబడులు పెట్టకూడదని ప్రశ్నించారన్నారు. ఆ ఆవేదన, ఆకాంక్ష నుంచే ఈ ప్రాజెక్ట్ పురుడు పోసుకుందని తెలిపారు. వెంటనే సంబంధిత శాఖలను అప్రమత్తం చేసి, రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఫేజ్-2లో 102 ఎకరాల భూమిని కేటాయించడమే కాకుండా, అనుమతులన్నీ వేగంగా మంజూరు చేశామని గుర్తుచేశారు. ఒక సామాన్య సంభాషణ నుంచి భూమిపూజ వరకు సాగిన ఈ ప్రయాణం ఏపీ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు.

రూ.2,300 కోట్ల పెట్టుబడి - 2,000 మందికి ఉపాధి

బ్లూ జెట్ సంస్థ దాదాపు రూ.2,300 కోట్ల భారీ పెట్టుబడితో ఈ యూనిట్‌ను నెలకొల్పుతోంది. దీని ద్వారా 1,750 మందికి ప్రత్యక్షంగానూ, 250 మందికి పరోక్షంగానూ ఉపాధి లభిస్తుంది. ఇక్కడ 2,000 కిలోలీటర్ల సామర్థ్యంతో ఏపీఐ, ఇంటర్మీడియట్స్ తయారీ యూనిట్‌ను అభివృద్ధి చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' వంటి అత్యాధునిక సాంకేతికతను ఇక్కడ వినియోగించనున్నారు.

**ఎకనామిక్ హబ్‌గా ఉత్తరాంధ్ర**

విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు. ఇప్పటికే గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలర్ మిట్టల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలు ఉత్తరాంధ్ర వైపు చూస్తున్నాయన్నారు. విశాఖ పోర్ట్ కనెక్టివిటీ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఈ ప్రాంతానికి అదనపు బలమని పేర్కొన్నారు. ఫార్మా, మెడికల్ డివైసెస్, పెట్రోకెమికల్స్ రంగాలకు ఉత్తరాంధ్రను కేంద్ర బిందువుగా మారుస్తామని భరోసా ఇచ్చారు.

20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోమని, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ ఏకైక అజెండా అని మంత్రి పునరుద్ఘాటించారు. దేశానికి వస్తున్న పెట్టుబడి ప్రతిపాదనల్లో 25.3 శాతం ఏపీకే రావడం గర్వకారణమన్నారు. బ్లూ జెట్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపిన లోకేశ్, ప్రభుత్వం ఎల్లప్పుడూ వాట్సాప్ మెసేజ్ దూరంలోనే అందుబాటులో ఉంటూ సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

# విద్య, భద్రత, భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం

**మొదటిపేజీ తరువాయి**

సిఫార్సుల మేరకు టీటీడీ చరిత్రలో తొలిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో మెరుగైన విద్యను అందించేందుకు గాను రూ.118.89 కోట్లు కేటాయింపు చేశారు.. ఇందులో భాగంగా డిజిటల్ క్లాస్ రూములు, అదనపు హాస్టల్ బ్లాకులు, వంట గదుల ఆధునీకరణ, ఇతర మౌళిక సదుపాయాలు వంటి సమూలమైన మార్పులను తీసుకొచ్చేందుకు ఆమోదం ఇచ్చింది. భక్తుల విజ్ఞప్తి మేరకు శ్రీవారికి ముడుపులు అందించే దాతల సౌకర్యార్థం 'శ్రీవారి ముడుపు పత్రం పథకం' ను ప్రయోగాత్మకంగా ప్రారంభించాలనే నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం భక్తులు మొక్కుల రూపంలో శ్రీవారి హుండీలో కానుకలు వేస్తున్నారు. ఇందుకు బదులుగా భక్తులు తిరుమలలో ఏర్పాటు చేసే కౌంటర్లలో చెల్లింపులు చేస్తే అందుకు తగిన ముడుపు పత్రాలు అందజేస్తారు. వాటిని నేరుగా శ్రీవారి హుండీలో వేయవచ్చు. తద్వారా భక్తులు నగదు, నాణెళిలు తీసుకువచ్చేందుకు ఉన్న ఇబ్బందులు తొలగుతాయి. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో అన్న ప్రసాద భవనం, ఆధునిక వంటశాలను అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించేందుకు రిలయన్స్ సంస్థ రూ.100 కోట్ల నుండి రూ.120 కోట్లు విరాళం అందించేందుకు ముందుకు రావడంతో పనులు ప్రారంభించేందుకు ఆమోదం ఇచ్చారు. ఆలయాలు, ప్రాకారాలు, రాజ గోపురాలు తదితర నిర్మాణాలకు అయ్యే ఖర్చును దృష్టిలో ఉంచుకుని తదనుగుణంగా శ్రీవాణి ట్రస్టు మార్గదర్శకాలను మార్పు చేసేందుకు ఆమోదం ఇచ్చారు. ఒంటిమిట్టలో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం ఏర్పాటుకు గాను డ్రై ఐల్యాండ్ నిర్మించేందుకు నిర్ణయం. అందుకుగాను రూ.20.17 కోట్లతో పనులకు ఆమోదం. కోయంబత్తూర్, గువహటి, బెలగావి, అదేవిధంగా పాట్నా వద్ద మోకామ నగరంలో శ్రీవారి ఆలయాల నిర్మాణాలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు టీటీడీకి కేటాయించిన భూమిని తీసుకునేందుకు ఆమోదం. వకుళమాత ఆలయంలో అక్షర గోవిందం పేరుతో అక్షరాభ్యాస కార్యక్రమం ప్రారంభించాలని నిర్ణయం. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 1వ తేదీన జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసే దాదాపు 70 వేల మంది భక్తులకు ఈ ఏడాది అదనంగా రూ.50 విలువ చేసే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందించాలని నిర్ణయించాం. గత ఏడాది తలంబ్రాల ప్యాకెట్ కిట్‌ను అందించిన విషయం తెలిసిందే. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తులను ఆకట్టుకునేలా రూ. 4.25 కోట్లతో విద్యుత్ అలంకరణలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్ఈడి బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.ఆర్మీ వెల్ఫేర్ ప్లేస్ మెంట్ ఆర్గనైజేషన్ ద్వారా తిరుపతిలో 356 మంది, తిరుమలలో 371 మంది భద్రత సిబ్బంది నియామకానికి ఆమోదం. అలిపిరి తనిఖీ కేంద్రంలో రూ.8 కోట్లతో ఎక్స్ రే బ్యాగేజ్ స్కానర్లు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటుకు ఆమోదం. తిరుమల, తిరుపతిలోని టీటీడీ గోశాలలు, పలమనేరు లోని శ్రీవేంకటేశ్వర ఇంక్యూబేషన్ సెంటర్ లలో రూ.11.28 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం. టీటీడీ ఆలయాల్లో పరిచారకులుగా పని చేస్తున్న 51 మందికి అర్చకులుగా పదోన్నతి కల్పించేందుకు గాను ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయం. పార్వతీపురం మన్యం జిల్లాలో శ్రీ వేంకటేశ్వర దివ్య క్షేత్రం నిర్మాణానికి రూ.14.25 కోట్లు కేటాయింపు.

## సిఎస్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన జి.సాయిప్రసాద్

**మొదటిపేజీ తరువాయి**

కార్యక్రమం అనంతరం ఉ.11.33 గం.లకు సిఎస్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈసందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎస్.రావత్, యం.టి.కృష్ణబాబు, ఎక్స్ అఫిషియో స్పషల్ సిఎస్ బి.రాజశేఖర్ తదితర ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు,ముఖ్య కార్యదర్శులు శ్యామల రావు,ముఖేశ్ కుమార్ మీనా,కాంతిలాల్ దండే తదితర ముఖ్య కార్యదర్శులు, ఎస్.సత్యనారాయణ,ఎంఎం నాయక్,ప్రతిభాదేవి తదితర కార్యదర్శులు, వివిధ శాఖాధిపతులు,రాష్ట్ర సచివాలయం సహా వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సిఎస్ కు పుష్పగుచ్చాలు అందించి శుభా కాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ సహా వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు శుభాకాంక్షలు తెలిపారు.ఇంకా వివిధ శాఖల అధికారులు,ఉద్యోగులు సిఎస్ సాయి ప్రసాద్ కు శుభా కాంక్షలు తెలిపారు.1991 ఐఏఎస్ బ్యాచ్ ఎపి క్యాడర్ కు చెందిన సాయి ప్రసాద్ ఎంటెక్ పట్టభద్రులు కాగా 1991 సెప్టెంబరు 15న ఐఏఎస్ కు ఎంపికై 1992 జూన్ నుండి 1993 మే వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వరంగల్ అసిస్టెంట్ కలక్టర్ గా పని చేశారు.అనంతరం 1993 సెప్టెంబరు నుండి 1995 ఏప్రిల్ వరకు పాడేరు అసిస్టెంట్ కలక్టర్ గా,1995 ఆగస్టు నుండి 1997 మార్చి వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ గా పని చేశారు. అనంతరం 1997 మే నుండి 1998 ఆగస్టు వరకు కడప జాయింట్ కలక్టర్ గా,2000 జూలై నుండి 2003 జూన్ వరకూ కర్నూల్ కలక్టర్ గా, 2003 జూన్ నుండి 2003 అక్టోబరు వరకు చిత్తూరు జిల్లా కలక్టర్ గాప పనిచేశారు.2003 అక్టోబరు నుండి 2004 ఆగస్టు వరకు ఎపి ట్రాన్సుకో జెఎండిగా,2004 ఆగస్టు నుండి 2006 మే వరకు ఇపిడిపిసిఎల్ సిఎండిగా, 2006 మే నుండి 2010 ఫిబ్రవరి వరకు ఎపి సిపిడిసిఎల్ సిఎండిగా పని చేశారు.2010 ఫిబ్రవరి నుండి 2011 అక్టోబరు వరకు ఎపి హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా పని చేశారు.అనంతరం 2011 అక్టోబరు నుండి 2014 జూన్ వరకు కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. తదుపరి 2014 జూన్ నుండి 2016 ఫిబ్రవరి వరకు సియం కార్యదర్శిగా,2016 ఫిబ్రవరి నుండి 2019 మే వరకు సియం ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. తదుపరి 2020 జనవరి నుండి 2022 ఫిబ్రవరి వరకు ఎపి సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రవేట్ లిమిటెడ్ కు సిఎండి గాను మరియు ఇంధన శాఖ ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీగాను పని చేశారు. అనంతరం 2022 ఫిబ్రవరి నుండి 2024 జూన్ వరకు సిసిఎల్ఏగా పనిచేశారు.

# సర్వైకల్ క్యాన్సర్‌పై సమరం..

**మొదటిపేజీ తరువాయి**

రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి లాంఛనంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని సమక్షంలో పలువురు పాఠశాల విద్యార్థినులకు టీకాలు వేశారు. అనంతరం మోదీ వారితో ముచ్చటించారు. ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా లక్షలాది మంది బాలికలకు భవిష్యత్తులో క్యాన్సర్ ముప్పు నుంచి రక్షణ లభిస్తుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. నివారణ ఆరోగ్య సంరక్షణకు తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఈ కార్యక్రమం నిదర్శనమని పేర్కొంది.రాజస్థాన్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. కిషన్‌గఢ్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, గవర్నర్ స్వాగతం పలికారు. ఈ పర్యటనలో జైపూర్-బండికుయ్ ఎక్స్‌ప్రెస్‌వే, అమృత్‌సర్-జామ్‌నగర్ ఎకనామిక్ కారిడార్‌లోని ఓ భాగాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే జోధ్‌పూర్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్మించనున్న నాలుగు లేన్ల ఎలివేటెడ్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.వీటితో పాటు 'ప్రతి ఇంటికి నీరు' పథకంలో భాగంగా తాగునీటి ప్రాజెక్టులకు, పునరుత్పాదక ఇంధన రంగంలో భాగంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ, గ్రిడ్ సబ్-స్టేషన్లకు కూడా ఆయన శంకుస్థాపనలు చేశారు. రాష్ట్రంలో 'రోజ్‌గార్ ఉత్సవ్' కింద కొత్తగా ఎంపికైన 21,800 మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. మహిళల ఆరోగ్యం, మౌలిక సదుపాయాల విస్తరణ, ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రధాని రాజస్థాన్ పర్యటన సాగింది.

## యుద్ధం ముంగిట రెండు దేశాలు

**మొదటిపేజీ తరువాయి**

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ కార్యాలయానికి సమీపంలోనే ఈ పేలుళ్లు సంభవించినట్లు తెలుస్తోంది. నగరవ్యాప్తంగా భారీ శబ్దాలు వినిపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఏం జరుగుతోందో తెలియక జనం తమ వాహనాల్లో ఇళ్లు వదిలి సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

ఈ దాడులతో పశ్చిమాసియాలో యుద్ధం మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని ప్రపంచ దేశాలు ఉత్కంఠగా గమనిస్తున్నాయి. ఇప్పటికే అమెరికా సహా పలు దేశాలు సంయమనం పాటించాలని కోరుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య ఘర్షణ సద్దుమణిగేలా కనిపించడం లేదు. టెహ్రాన్‌లో ప్రస్తుతం అప్రకటిత ఎమర్జెన్సీ వాతావరణం నెలకొంది.

## క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యంగా అడుగులు

**మొదటిపేజీ తరువాయి**

మహిళల్లో అత్యధికంగా వస్తున్న సర్వైకల్ క్యాన్సర్‌ను అరికట్టేందుకు 15 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌పీవీ టీకాలను ఉచితంగా అందిస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. బయట మార్కెట్లో రూ.4 వేలు ఉండే ఈ టీకాను, రాష్ట్రంలోని 3.45 లక్షల మంది బాలికలకు ఉచితంగా అందించేందుకు రూ.14.11 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. కర్నూలులో రూ.50 కోట్లతో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేస్తున్నామని, తాజా బడ్జెట్‌లో వైద్య రంగానికి ఏకంగా రూ.19,305 కోట్లు కేటాయించామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు.ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సీఎం కీలక ప్రకటన చేశారు. రాబోయే మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి, ప్రతి ఎకరానికి నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, విశాఖలో డేటా సెంటర్ల రాకతో ఈ ప్రాంత ముఖచిత్రం మారిపోనుందని చెప్పారు.గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గత పాలకులు ప్రజలనే కాకుండా దేవుడిని కూడా మోసం చేశారని, తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడి అపచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా భూములు కాజేయాలని చూస్తే, తాము అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు భరోసా కల్పించామని గుర్తుచేశారు. సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం అందిస్తూ 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ' ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే ఎన్డీఏ కూటమి లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# 99 రోజుల యాక్షన్ ప్లాన్

**అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం**
**కాకినాడ ఘటనపై రేవంత్ దిగ్భ్రాంతి**

హైదరాబాద్, **ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్.** సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. మార్చి నుంచి జూన్ వరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు ఘటనపై సిఎం దగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 23కి చేరింది. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఉగాది ఉత్సవాలను పటిష్టంగా నిర్వహించాలి

## భక్తులకు పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల, బ్యూరో ఫిబ్రవరి 28 (రిపబ్లిక్ న్యూస్):** శ్రీశైలంలో మార్చి 16 నుంచి 20 వరకు నిర్వహించనున్న ఉగాది ఉత్సవాలను ఘనంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె ఉత్సవ ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు.జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైలం క్షేత్రానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భారీగా భక్తులు తరలివస్తారని తెలిపారు. గత సంవత్సరం సుమారు 7 లక్షల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారని, ఈ సంవత్సరం కూడా అదే స్థాయిలో రద్దీ ఉండే అవకాశమున్నందున ముందస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. మార్చి 2వ తేదీ నుంచి పాదయాత్ర భక్తులకు అనుమతి ఉంటుందని వెల్లడించారు.

### త్రాగునీరు వైద్య సదుపాయాలు

భక్తులకు సమృద్ధిగా త్రాగునీరు అందించేందుకు రోజుకు 4 నుంచి 5 లక్షల నీటి బాటిళ్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని ఆదేశించారు. మార్చి 8వ తేదీ నుంచి ప్రధాన ప్రదేశాలు, పార్కింగ్ స్థలాలు, పాదయాత్ర మార్గాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి రొటేషన్ పద్ధతిలో వైద్యులను అందుబాటులో ఉంచాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. బయో మెడికల్ వ్యర్థాలను ప్రత్యేకంగా రెడ్ కలర్ డస్ట్‌బిన్లలో సేకరించి తక్షణం నిర్వహించాలని సూచించారు.

### పారిశుద్ధ్యం మౌలిక వసతులు

ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. భక్తులు వినియోగించిన ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను నిర్దిష్ట ప్రదేశాల్లో సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆలయ ఈఓను ఆదేశించారు. గాలివానలు వచ్చినా షెడ్లు, తాత్కాలిక నిర్మాణాలు దృఢంగా ఉండేలా ఆర్ అండ్ బి శాఖ తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. విద్యుత్ తీగలు వేలాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### పార్కింగ్ - ట్రాఫిక్ నిర్వహణ

పార్కింగ్ ప్రదేశాల్లో తగినంత వెలుతురు, త్రాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు వాహనాలు మొరాయించినపుడు తరలించేందుకు క్రేన్లు, టోయింగ్ వాహనాలు మెకానిక్స్‌తో సహా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. లింగాలగట్టు, పాతాళగంగా ప్రాంతాల్లో ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని మత్స్య శాఖకు సూచించారు.

### భక్తుల సౌకర్యం - భాషా సేవలు

తెలుగు, కన్నడ భక్తుల కోసం 'మే ఐ హెల్ప్ యూ' డెస్క్‌లను పెంచాలని, ముఖ్యంగా కన్నడ భక్తులు అధికంగా వచ్చే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని తెలిపారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా కన్నడలోనూ ప్రకటనలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యావసర వస్తువులు అధిక ధరలకు విక్రయించకుండా పర్యవేక్షణ చేయాలని, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

### దర్శన ఏర్పాట్లు

రోజుకు 8,000 నుంచి 10,000 మందికి స్లాట్ విధానంలో దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఒక్కో స్లాట్ రెండు గంటల పాటు ఉండగా, మొత్తం ఎనిమిది గంటలు స్లాట్ దర్శనం నిర్వహిస్తారు. మిగిలిన సమయంలో ఉచిత దర్శనం కొనసాగుతుంది. స్పర్శ దర్శనం ప్రారంభానికి గంటన్నర ముందే ఉచిత దర్శనం క్యూ లైన్లను ఖాళీ చేసేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు.జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన సమయాల వివరాలు డిస్ప్లే బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. పార్కింగ్ నిర్వహణ, విద్యుత్ భద్రత, టోల్ మినహాయింపు (మార్చి 1619 వరకు), పాతాళగంగా బోటు సేవలలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భక్తుల రద్దీని బట్టి 6వ తేదీ నుంచి వాలంటీర్లను నియమించే అంశంపై చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కర్ణాటక, అనంతపురం ప్రాంతాల నుంచి వాలంటీర్లను సమీకరించనున్నట్లు చెప్పారు. కన్నడ భాష తెలిసిన పోలీసు సిబ్బందిని కర్నూలు జిల్లా నుంచి రప్పించేందుకు ఇప్పటికే లేఖ రాసినట్లు వెల్లడించారు. ఆత్మకూరు అటవీ శాఖ డిడి విఘ్నేష్ అపూర్వ మాట్లాడుతూ అటవీ ప్రాంతాల గుండా వచ్చే పాదయాత్ర మార్గాల్లో ఫైర్ వాచర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రధాన పాయింట్ల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అంతకుముందు దేవస్థాన ఈఓ శ్రీనివాసులు ఉగాది ఉత్సవాల ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓలు, డిఎస్పీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# వేసవి కాలంలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి





**చిప్పగిరి, ఫిబ్రవరి, 22,( రిపబ్లిక్ న్యూస్)** రానున్న వేసవి కాలంలో మండలంలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ జూటూరు హేమలత అన్నారు, మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం అధ్యక్షతన తో పాల్గొన్నారు, ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పైపులైన్ వ్యవస్థ పటిష్టం చేయాలని ఇబ్బందులు లేకుండా చేయాలని సూచించారు, ఈ సమావేశంలో పలు శాఖలు చేపట్టిన అభివృద్ధి ,ప్రగతిని సమావేశంలో చదివి అధికారులు వినిపించారు, గ్రామంలో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని సమస్య పరిష్కరించడం లేదని విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు కోరారు, అనంతరం ఎంపీపీ జూటూరు హేమలత 125 రోజులు గ్రామీణ ఉపాధికి మెరుగైన హామీ గోడ పత్రికలను విడుదల చేశారు,ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అల్లా బకాస్ ,సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, ఏపీఓ జుబేర్ అహ్మద్, వెలుగు ఏపీఎం శివయ్య ,వైద్యాధికారి అఫ్రోజ్ జహన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకట రమణి, డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు, సచివాలయ డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, అగ్రికల్చర్ ఏఈఓ రమాదేవి, ఎంఈఓ సావిత్రమ్మ, ఎలక్ట్రికల్ జంపన్న, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఈరమ్మ, రెవిన్యూ జూనియర్ అసిస్టెంట్ వీరేష్, కుందన గుర్తి సర్పంచ్ కొండా పురుషోత్తం, సురేష్, నాగేంద్ర , దేగులహాల్ సర్పంచ్ నీలకంఠ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్లు, తదితరులు పాల్గొన్నారు.

# అనధికార నిర్మాణాలు, లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

## బీపీఎస్, ఎల్ఆర్ఎస్ పథకాల ప్రయోజనాలను వినియోగించుకోవాలి: కమిషనర్ పి.విశ్వనాథ్







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 28)** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బిపిఎస్), లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) ద్వారా అనధికార నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లను ప్రజలు క్రమబద్ధీకరించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు.శనివారం ఆయన జొహరాపురం ప్రాంతంలోని వివిధ చోట్ల ఉన్న అనధికార లేఅవుట్లు, నిర్మాణాలను పరిశీలించారు. ఇప్పటికే జారీ చేసిన నోటీసులపై ఆరా తీశారు. కొత్తగా జరుగుతున్న నిర్మాణాలు అనుమతించిన ప్లాన్ ప్రకారం జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని కూడా సమీక్షించారు.నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో బిల్లింగ్ ఇన్స్పెక్టర్లు దివాకర్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది

## ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి





**నంద్యాల, బ్యూరోఫిబ్రవరి 28 (రిపబ్లిక్ న్యూస్):** ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ సందర్భంగా లబ్ధిదారుల కళ్లలో ఆనందం కనిపించడం ప్రభుత్వానికి గొప్ప సంతృప్తినిస్తోందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ అన్నారు. శనివారం నంద్యాల పట్టణం లోని సద్దులపేట, బుడగ జంగాల వీధిలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రితో పాటు జి. రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పింఛన్ మొత్తాన్ని దశలవారీగా పెంచిన ఘనత నారా చంద్రబాబు నాయుడుదేనని తెలిపారు. గతంలో రూ.200గా ఉన్న పింఛన్‌ను రూ.1,000కు, అనంతరం రూ.2,000కు పెంచినట్లు పేర్కొన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3,000గా ఉన్న పింఛన్‌ను రూ.4,000కు పెంచుతూ, అదనంగా మూడు నెలల పెంపు మొత్తాన్ని కలిపి తొలి నెలలోనే రూ.7,000 చొప్పున లబ్ధిదారులకు అందజేసినట్లు వివరించారు. ప్రతి నెల 1వ తేదీన పింఛన్ పంపిణీ జరుగుతుందని, ఒకటవ తేదీ ఆదివారం వంటి సెలవు రోజు వస్తే ముందస్తుగా పింఛన్ అందజేస్తున్నామని మంత్రి తెలిపారు. మార్చి 1వ తేదీ ఆదివారం కావడంతో, రాష్ట్రవ్యాప్తంగా ఒక రోజు ముందుగానే ఫిబ్రవరి 28న పింఛన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నంద్యాల పట్టణం సహా జిల్లాలోని అన్ని వార్డులు, గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి నెలా ఒకటో తేదీన సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈసారి మార్చి 1 ఆదివారం కావడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా ఫిబ్రవరి 28న ముందస్తుగా పంపిణీ చేపట్టామని చెప్పారు. నంద్యాల జిల్లాలో దాదాపు 2,16,000 మంది లబ్ధిదారులకు సుమారు రూ.92 కోట్ల పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. జిల్లాలో సుమారు 4,700 మంది పింఛన్ డిస్బర్స్‌మెంట్ అధికారులు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారని తెలిపారు. ప్రతి నెలా సుమారు 97 శాతం పంపిణీ విజయవంతంగా పూర్తవుతోందని పేర్కొన్నారు. బుడగజంగం కాలనీలో కలెక్టర్ స్వయంగా పర్యటించి లబ్ధిదారుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారి కుటుంబ పరిస్థితులు, పిల్లల విద్య, జీవనోపాధి అవకాశాలపై ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి ప్రతి అర్హుడికి చేరేలా జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. త్వరలోనే ఆ కాలనీలో వార్డు సభ నిర్వహించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని అవసరమైన సేవలు మరింత సమర్థవంతంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ విశ్వనాథ్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎమ్మార్వో శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సొంత ఖర్చులతో హైస్కూల్ గ్రౌండ్ శుభ్రం చేసిన సీఐ మంజునాథరెడ్డి ఎస్ఐ అశోక్

**అవుకు ఫిబ్రవరి 28 రిపబ్లిక్ (న్యూస్)**

అవుకు స్థానిక్గానూ హైస్కూల్ మైదానంలో క్రీడాకారులకు విద్యార్థులకు అడ్డుగా పెరిగిన ముళ్ల పొదలను తమ సొంత ఖర్చులతో తొలగించి ప్రజల ప్రశంసలు అందుకున్నారు సీఐ మంజునాథరెడ్డి ఎస్ఐ అశోక్ ఎన్నో రోజులుగా మైదానంలో పెరిగిన ముళ్ల పొదల కారణంగా విద్యార్థులు మరియు యువ క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు స్వయంగా ముందుకు వచ్చి తమ సొంత వ్యయంతో శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు


వారి సేవా భావాన్ని స్థానికులు, విద్యార్థులు అభినందించారు. ఈ చర్యతో మైదానం మరింత సురక్షితంగా మారి క్రీడా కార్యక్రమాలు సజావుగా నిర్వహించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడింది

సమాజాభివృద్ధి కోసం కట్టుబడి ఉన్న అధికారులుగా వారు మరోసారి ఆదర్శంగా నిలిచారని ప్రజలు స్కూల్ విద్యార్థులు క్రీడాకారులు పేర్కొన్నారు



# నగరడోన గ్రామంలో మేత వామి దగ్ధం









**చిప్పగిరి, ఫిబ్రవరి, 28, ( పబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం నగర డోన గ్రామం నందు శనివారం దేవప్ప గారి కుమారుడు రాముడు మేత వామి ప్రమాదవశాత్తు కాలిపోయింది, సుమారు 50 వేల నష్టం జరిగి ఉంటుందని గ్రామ ప్రజలు తెలిపారు, బాధితులు వెంటనే ఫైర్ స్టేషన్ సమాచారం అందించారు, ఫైర్ సిబ్బంది వచ్చే లోపల పూర్తిగా దగ్ధం అయిందని వేరే ప్రాంతాలకు తరలకుండా మంటను అదుపు చేశారు, రైతు దేవప్ప కుమారుడు రాముడు మాట్లాడుతూ ఏడాది పొడవున పశువుల కోసం నిలువ చేసుకున్న మేత పూర్తిగా బూడిద అయిందని ,పశువుల మేత కోసం ఇబ్బంది పడాల్సి వస్తుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు, సంఘటన తెలుసుకున్న సాగునీటి అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడుని పరామర్శించాడు, అనంతరం రెవెన్యూ అధికారులు ఆర్ఐ సునీత, విఆర్ఓ మల్లికార్జున, సంఘటన పరిశీలించారు, సర్పంచ్, అధికారులు, స్పందించి బాధిత రైతులకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



### మడకశిర మండలం భీమరాయనపల్లి

# నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



**మడకశిర, ఫిబ్రవరి 28: (రిపబ్లిక్ న్యూస్)**
మడకశిర మండలంలోని భీమరాయనపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తారాస్థాయికి చేరింది. బోర్లు ఎండిపోవడంతో, మోటార్లు పనిచేయకపోవడంతో గ్రామస్తులు రెండు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని తట్టుకోలేక మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో చేశారు. "నీరు ఇవ్వకపోతే కదలేది లేదు" అంటూ నినాదాలు చేస్తూ, రాజకీయాలకు అతీతంగా ఏకమై న్యాయం కావాలని డిమాండ్ చేశారు. సమస్యను పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతూ, వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని పట్టుబడుతున్నారు. గ్రామస్తుల ఆగ్రహం పెరుగుతుండగా, స్థానిక ప్రజాప్రతినిధులపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "సమస్య పరిష్కరించకపోతే కార్యాలయాన్ని ముట్టడిస్తాం" అని హెచ్చరిస్తున్నారు. వేసవి రాకముందే ఇంతటి నీటి కష్టాలు తలెత్తడం, అధికారుల నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తోంది. భీమరాయనపల్లి మాత్రమే కాదు, మొత్తం మడకశిర నియోజకవర్గంలో తాగునీటి సమస్య ప్రజలను రోడ్డెక్కిస్తోంది.

## వైభవంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

### పాల్గొన్న బాటనీ హెచ్ ఓ డి డాక్టర్ శ్రీదేవి



**అనంతపురం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28,(రిపబ్లిక్ న్యూస్):**
జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆర్ట్స్ కళాశాల బాటనీ హెచ్ ఓ డి డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం నగరం హౌసింగ్ బోర్డ్ లో గల భాష్యం విద్యాసంస్థల్లో విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని కన్నుల పండగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల బాటనీ హెచ్ ఓ డి డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ఈ ఎల్కేజీ నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టను తయారు చేయడం, ఆ ప్రాజెక్టులను వివరించడం ఆమెను అబ్బురపరిచాయని సూచించారు. అందులో భాగంగా ఒక పాఠశాలలో ఇన్ని ప్రాజెక్టులు చేసి వాటిని వివరించిన విధానం సందర్శకుల కళ్ళను కట్టిపడేశాయని ఆమె అన్నారు. సైన్స్ అంటే ఒక సబ్జెక్టు కాదని సైన్స్ అంటే నేర్చుకోవడం. జ్ఞానం మనిషిని గొప్పవాడిని చేస్తుందన్నారు. ప్రాజెక్టుల సందర్శించిన అనంతరం పిల్లలు చేసిన ప్రాజెక్టులకు బహుమతులను అందజేసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్, అనంతపురం జిల్లా జెడ్ ఈవో రవి వర్మ, ప్రిన్సిపల్ బాలకృష్ణ, హెచ్ఎం, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.ద

## తనకల్లు మండలంలో పౌర హక్కుల దినోత్సవం ఘనంగా



**తనకల్లు, ఫిబ్రవరి 28: (రిపబ్లిక్ న్యూస్)** తనకల్లు మండలం పరిధిలో దేవలంతాండ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ క్రాంతి కుమార్, డివిఎంసి సభ్యులు చెరుకూరి గంగులయ్య, ఆర్ఐ అశోక్, వీఆర్వో గంగాధర్, ఎస్ఓ, కానిస్టేబుల్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు అవగాహనకార్యక్రమంలో తహసిల్దార్ క్రాంతి కుమార్ ప్రజలకు హక్కులు, బాధ్యతలు గురించి అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు బానిసలవుతున్నారని, సెల్ఫోన్ బెట్టింగ్స్, అప్పులు, మద్యం సేవించడం, బాల్యవివాహాలు వంటి సమస్యలపై హెచ్చరికలు ఇచ్చారు. "ప్రజలు తమ హక్కులపై మాట్లాడాలి, బాధ్యతలను నిర్వర్తించాలి. చెడు అలవాట్లకు బానిస కాకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. ప్రజల సమస్యలుగ్రామ ప్రజలు అధికారుల దృష్టికి స్మశాన వాటిక లేకపోవడం, మంచినీటి వసతి లేకపోవడం వంటి సమస్యలను తీసుకువచ్చారు. అధికారుల స్పందనతహసిల్దార్ క్రాంతి కుమార్, డివిఎంసి సభ్యులు చెరుకూరి గంగులయ్య, మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా చైర్మన్, ఆర్ఐ అశోక్, వీఆర్వో గంగాధర్, గ్రామ ప్రజలతో కలిసి స్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. తహసిల్దార్ వెంటనే ప్రొసీడింగ్స్ ఇస్తానని హామీ ఇచ్చారు

## గుడిబండ కరువు మండలంగా గుర్తింపు

### ఉపాధి హామీ కూలీలకు అదనపు పని దినాలు




**గుడిబండ, ఫిబ్రవరి 28: (రిపబ్లిక్ న్యూస్)**
గుడిబండ మండలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని ఎంపీడీవో కేశవరెడ్డి మీడియాకు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ, కరువు పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు అదనంగా 50 రోజుల పని దినాలు కల్పించిందని తెలిపారు. ఎంపీడీవో కేశవరెడ్డి మాట్లాడుతూ "మండలంలోని ఉపాధి హామీకూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కూలీలకు ఉపాధి భరోసా కల్పించడమే లక్ష్యం" అని పేర్కొన్నారు. సమగ్ర సమాచారంగుడిబండ మండలం కరువు మండలంగా గుర్తింపు పొందింది. ఉపాధి హామీ కూలీలకు అదనంగా 50 రోజుల పని లభ్యం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భరోసా. కూలీలను ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో సూచించారు. ఈ విధంగా, గుడిబండ మండలంలోని ప్రజలకు ఉపాధి హామీ ద్వారా తాత్కాలిక ఉపశమనం లభించనుంది.

# మెడికల్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోండి

**సీపీఐ డిమాండ్**
**ప్రజల ప్రాణాలతో చెలగాటం**
**అరికట్టకపోతే తిరుగుబాటు తప్పదు**
**నగర కార్యదర్శి ఎన్ శ్రీరాములు హెచ్చరిక**
**ప్రభుత్వం తక్షణమే స్పందించాలి**




**అనంతపురం వైద్యం, ఫిబ్రవరి 28,(రిపబ్లిక్ న్యూస్):**
మెడికల్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని నగర కార్యదర్శి ఎన్ శ్రీరాములు డిమాండ్ చేశారు. శనివారం రాంనగర్‌లోని డ్రగ్ కంట్రోల్ కార్యాలయం వద్ద నగర సీపీఐ సమితి ఆధ్వర్యంలో మెడికల్ మాఫియాకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నగర కార్యదర్శి ఎన్ శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం సీపీఐ జిల్లా కార్యదర్శి పి. నారాయణస్వామి హాజరయ్యారు.

**నాణ్యతలేని మందుల లేబుళ్లు మార్చి విక్రయం**
ఈ సందర్భంగా నగర కార్యదర్శి ఎన్ శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ మాఫియా దందా పెరుగుతోందని మండిపడ్డారు. ప్రజలు ఆసుపత్రుల్లో అవసరమైన మందులు కొనలేని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో మందుల కొరత కారణంగా రోగులు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని,పక్క రాష్ట్రాల మెడికల్ దందా నడుపుతున్నటువంటి వారి నుండి పేరులేని, నాణ్యతలేని మందులు కొనుగోలు చేసి రాష్ట్రంలో పేరుమోసిన మెడికల్ స్టోర్లలో లేబుళ్లు మార్చి విక్రయిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఇది ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని మండిపడ్డారు. అలాగే మెడిసిన్స్ పైన జిఎస్టి తొలగించి సుగర్, బీపీ లాంటి మందులపై ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.




**అధికార యంత్రాంగం ప్రజల ఆరోగ్యాన్ని విస్మరించింది**
ఈ ఒక్క మెడిసిన్ మెడికల్ షాప్ లోను ఫార్మసీట్స్ లేకుండ డాక్టర్ మెడికల్ ప్రేసిక్రిప్షన్ లేకున్నా మందులు విక్రయం చేయడం జరుగుతోందన్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు కుర్చీలకే పరిమితమై తనిఖీలు నిర్వహించడంలో విఫలమయ్యారని, అధికార యంత్రాంగం ప్రజల ఆరోగ్యాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. వీటిపై ప్రభుత్వం ప్రత్యక్షంగానో పరోక్షంగానో కఠిన చర్యలు తీసుకోవడంలో ఆసక్తి చూపడం లేదని పేర్కొన్నారు.

**మాఫియాను అరికట్టేంతవరకు పోరాటం చేస్తాం**
ప్రతి జిల్లాలో మెడికల్ టెస్టింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి మందుల నాణ్యతను పరీక్షించే వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ డిమాండ్ చేసింది. మెడికల్ మాఫియాను పూర్తిగా అరికట్టేంతవరకు సీపీఐ నిరంతర పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వం తక్షణమే స్పందించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎన్ శ్రీరాములు జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య నగర కార్యవర్గ సభ్యులు ఎల్లుట్ల నారాయణస్వామి సూర్యనారాయణ ,జమీర్, రాజు,ఏఐవైఎఫ్ శ్రీనివాస్ మహిళా సమైక్య జిల్లా నాయకురాలు యశోదమ్మ చేతి వృత్తిదారుల జిల్లా నాయకులు నగప్పా తదితరాలు పాల్గొన్నారు.

# అడ్డదారుల్లో జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

**హెడ్ కానిస్టేబుళ్లకు, నిరుద్యోగులకు తీరని అన్యాయం**
**జూనియర్ అసిస్టెంట్లకు**
**ఎస్ఐ లుగా పదోన్నతులు నిలిపివేయాలని డిమాండ్**

**అనంతపురం క్రైమ్, ఫిబ్రవరి 28,(రిపబ్లిక్ న్యూస్):**
ఎక్సైజ్ శాఖ పదోన్నతుల్లో అయోమయం చోటుచేసుకుంది. జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఉద్యోగులు అక్రమ మార్గంలో ఎస్సైలుగా పదోన్నతులు పొందుతున్నారు. దీనివల్ల ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న హెడ్ కానిస్టేబుల్ లకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. తెలంగాణ తరహాలో జూనియర్ అసిస్టెంట్లకు ఎస్ఐలుగా పదోన్నతులు కల్పించకుండా కేవలం హెడ్ కానిస్టేబుల్ కు మాత్రమే ఎస్సైలుగా పదోన్నతులు కల్పిస్తే న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయ వ్యక్త పరిచారు. గ్రూప్ 2 ద్వారా 50 శాతం, హెడ్ కానిస్టేబుల్ లకు 50 శాతం పదోన్నతులు కల్పిస్తే అందరికీ న్యాయం జరుగుతుంది. అయితే మన రాష్ట్రంలో ప్రభుత్వ జీవోలను అడ్డం పెట్టుకొని జూనియర్ అసిస్టెంట్లు అడ్డదారుల్లో పదోన్నతులు పొందుతున్నారు. ఎక్సైజ్ కమీషనర్ కాన్స్టేబుల్ అసోసియేషన్ వారు ఇచ్చిన వినతి మేరకు 21.04.2025 న ఒక కమిటీ ఏర్పాటు చేసి వివరాలు పరిశీలించారు.

**అక్రమంగా పదోన్నతి పొంది పాతూకుపోయారు**

రాష్ట్రంలో మొత్తం 556 పోస్టులకు గాను 248 మంది దాదాపు 45శాతం అంటే జూనియర్ అసిస్టెంట్ కోటా కంటే 20 శాతం ఎక్కువగాను,హెడ్ కానిస్టేబుల్ నుంచి ఎస్ ఐ 207 మంది అంటే వారి కోటా కంటే 3 శాతం తక్కువగా, డైరెక్టర్ రిక్రూట్మెంట్ ఎస్ ఐ 87 (15శాతం) దాదాపు 20శాతం తక్కువగా ఉండటం చూస్తే వారు అడహాక్ పేరుతో ఏ మేరకు అక్రమంగా పదోన్నతి పొంది పాతూకుపోయారో అర్థం కాని పరిస్థితి ఎక్సైజ్ శాఖలో నెలకొంది. అందులో భాగంగా రెగ్యులర్ గ్రూప్ 2 ద్వారా డైరెక్ట్ రిక్రూట్మెంట్ ఖాళీలు భర్తీ కాకపోవడం, పదవీ విరమణలు, పదోన్నతుల వల్ల ఏర్పడ్డ ఖాళీలలో జీఓ 33 ప్రకారం డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటా వదిలి మిగిలిన ఖాళీలను హెడ్ కానిస్టేబుళ్లకు 40 శాతం, జూనియర్ అసిస్టెంట్లకు 25 శాతం ఇవ్వాలి కానీ పై గుమస్తాలు కమీషనర్, జోనల్ డీసీ కార్యాలయాలలో పనిచేస్తూ జీవో ని పక్కాగా అమలు చేయకుండా తప్పుడు నిబంధనలతో రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ అసిస్టెంట్లకు అధిక మొత్తం లో అడహాక్ ప్రమోషన్లు కల్పించుకున్నారు. ఈ విధంగా డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటాలోని పోస్టు, కానిస్టేబుల్ నుంచి ఎస్ ఐ లు అయిన కొద్ది కాలంలోనే రిటైర్ కాగానే వారి పోస్టు లో ఇలా మొత్తంగా గుమస్తాలు అక్రమంగా పదోన్నతి పొందుతూ కానిస్టేబుళ్లకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. అలాగే డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటాలో పోస్టులకు ఆడహాక్ ప్రమోషన్ లతో పాటు అధిక వేతనాలు తీసుకుంటూ ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం చేకూరుస్తున్నారు.

**వెనక్కి రామంటూ హెడ్ కానిస్టేబుల్లే రివర్షన్**

అధిక సంఖ్యలో జూనియర్ అసిస్టెంట్లు పదోన్నతి పొందడం మూలాన, కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్ల కొరత కారణంగా వారి విధులు కూడా కానిస్టేబుళ్లు చేస్తున్నారు.
ప్రస్తుతం గ్రూప్ 2 లో ఎక్సైజ్ ఎస్ ఐ నియామకాలు జరిగి జూనియర్ అసిస్టెంట్లు రివర్షన్ రావాలి కానీ జూనియర్ అసిస్టెంట్ ల నుంచి ఎస్సై లు.. ఏ మాత్రం మేం వెనక్కి రామంటూ హెడ్ కానిస్టేబుల్లే రివర్షన్ వస్తారని డిపార్ట్మెంట్ లో చర్చించుకోవడం వల్ల తీవ్ర ఆవేదనలో హెడ్ కానిస్టేబుల్లు ఉన్నారు. పొరుగు రాష్ట్రం తెలంగాణలో క్రింది స్థాయి సిబ్బంది ఆవేదన అర్థం చేసుకొని తెలంగాణ ప్రభుత్వం జీవో. ఎంఎస్. నంబర్:37, 2022 ద్వారా జూనియర్ అసిస్టెంట్ కోటా తీసివేశారు. డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటా 50 శాతం నిరుద్యోగయువతకు 50 శాతం, హెడ్ కానిస్టేబుళ్లకు కేటాయించి అమలు పరిచి న్యాయం చేశారు. అదే విధంగా మన రాష్ట్రం లో కూడా తక్షణమే అమలు పరచి అటు నిరుద్యోగ యువతకు ఇటు ఏళ్లు తరబడి పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న శాఖ క్రింది స్థాయి హెడ్ కానిస్టేబుళ్లకు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం జూనియర్ అసిస్టెంట్లకు ఆడహాక్ పదోన్నతులు ఇవ్వకుండా, ప్రభుత్వానికి ఆర్థిక నష్టం జరగకుండా రెగ్యులర్ పదోన్నతలు కల్పించాలి.

**జూనియర్ అసిస్టెంట్లుకు .. ఎస్సైలుగా ప్రమోషన్**

1992లో ఉద్యోగంలో నియమితులైన వారు కానిస్టేబుల్ గా, హెడ్ కానిస్టేబుల్లుగానే నేటికీ ఉన్నారు. కానీ 2020 తరువాత జూనియర్ అసిస్టెంట్ లుగా వచ్చిన వారు మాత్రం ఎస్ ఐ లు అవుతున్నారు. ఎక్సైజ్ కోటాలో కానిస్టేబుల్ లో కోట 25 శాతం నుంచి 40 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జీవోను జారీ చేసింది. కానీ సదరు జీవో ద్వారా న్యాయం జరగడం లేదు. కానిస్టేబుల్ నుంచి ఎస్ఐలు వరకు ప్రమోషన్ వచ్చేవరకు వారికి 55 సంవత్సరాలు పూర్తి అవుతుంది. వారు ఐదు నుంచి ఎనిమిది సంవత్సరాలలో ఎస్సైలుగా ప్రమోషన్ పొంది రిటైర్ అవుతున్నారు. అదే జూనియర్ అసిస్టెంట్లుగా కేవలం ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తి కాకుండానే ఎస్సైలుగా ప్రమోషన్ పొందుతున్నారు. తద్వారా సుమారు వారు 20 - 25 సంవత్సరాల పాటు ఎస్సై నుండి వివిధ కేటగిరీలలో ప్రమోషన్ పొంది రిటైర్ అవుతున్నారు.
హెడ్ కానిస్టేబుల్ నుంచి ప్రమోషన్ పొందినవారు రిటైర్మెంట్ తీసుకున్నా గానీ ఆ ఖాళీలను మరల హెడ్ కానిస్టేబుల్ లతోనే భర్తీ కాకుండా ఈ 40 శాతం లో మరల 25 శాతం జూనియర్ అసిస్టెంట్ ను భర్తీ చేస్తున్నారు. దీనివల్ల కానిస్టేబుల్ గా పనిచేస్తున్న వారు వారి ప్రమోషన్ల విషయంలో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. కానిస్టేబుల్ గా నియామకం తీసుకుని కానిస్టేబుల్ల గానే సుమారు 30 - 35 సంవత్సరాలు విధులు నిర్వహించి కానిస్టేబుళ్లగానే రిటైర్ అవుతున్నారు. డైరెక్ట్ రిక్రూట్మెంట్ పోస్టులో ఎలా రిక్రూట్మెంట్ చేస్తారో అదేవిధంగా కానిస్టేబుల్ నుండి ఎస్ఐ లుగా ప్రమోషన్ తీసుకొని రిక్రూట్మెంట్, ప్రమోషన్ పై వెల్లిన ఖాళీగా ఉన్న ఎస్సై పోస్టులను కేవలం హెడ్ కానిస్టేబుళ్లకు మాత్రమే ఎస్ఐలుగా పదోన్నతులు కల్పించాలి. ఉదాహరణకు విశాఖపట్నం కు చేసిన హెడ్ కానిస్టేబుల్ తన యొక్క 33 ఏండ్ల సర్వీస్ లో హెడ్ కానిస్టేబుల్ గానే రిటైర్డ్ అవుతున్నారు. కానీ జూనియర్ అసిస్టెంట్ లు ఎస్సైలుగా పదోన్నతి పొంది రిటైర్డ్ అవుతున్నాను. కనుక జూనియర్ అసిస్టెంట్ల చర్యల వల్ల తీవ్రనిరాశలో ఉన్న హెడ్ కానిస్టేబుళ్లకు ఏ మేరకు న్యాయం చేస్తారన్నది వేచి చూడాల్సిందే. మరింత పూర్తి సమాచారం, ఆధారాలతో మరో కథనంలో మీ ముందుకు....

# కార్మికుల హక్కుల సాధనకోసం ఉద్యమించాలి

**ఆర్ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు పిలుపు**






**హిందూపురం ప్రతినిధి, ఫిబ్రవరి 28, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్ర వ్యాప్తంగా వున్న వివిధ రంఘాలలో పని చేస్తున్న కార్మికులు సమస్యల పరిష్కారం కోసం యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (UTUC) ముందుండాలని ఆర్ ఎస్ పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు పిలుపునిచ్చారు. హిందూపురం లోని షాదీ మహల్ నందు జరుగుతున్నా రెండవ రోజు యు టీ యు సి రాష్ట్ర మహాసభలో నాయకులకు పిలుపునిచ్చారు. అలాగే సమావేశాల్లో కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మిక చట్టాల్లో మార్పులు, ప్రైవేటీకరణ విధానాలు, కాంట్రాక్ట్ వ్యవస్థ పెరుగుదల వల్ల కార్మికుల హక్కులు దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వర్గం ఐక్యతతో పోరాడితేనే కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత సాధ్యమవుతాయని అన్నారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకం బలోపేతం చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వివిధ జిల్లాలలో కార్మికులు ఎదురుకుంటున్న సమస్యలపై చర్చించి రాజి లేని పోరాటాలు చేయాలన్నారు. పేదలకు ఉచిత విద్యా, వైద్యం ఇతర అవసరాలు తీర్చే ఆర్ డి డి సంస్థలను ఇబ్బందులకు గురిచేయడం అన్యాయం అన్నారు. ఈకర్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు, రాయుడు. ఆనంద్. అయ్యన్న, చంద్ర నరేంద్ర,, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత నెత్తిన మరో పిడుగు..



## పతనమైన టమోటా..

**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 28 - (రిపబ్లిక్ న్యూస్) - మదనపల్లి :-** ఏపీలో రైతన్నలు పండించిన పంటలకు ఇప్పటికే సరైన గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో రైతన్నల పరిస్థితి దయనీయంగా మారింది. రెండేళ్లుగా రైతన్నలకు నిరాశే ఎదురైంది. చేతికి వచ్చిన ఏ పంటలు లేక రైతన్నలు విలవిలాడుతున్నారు. గత సంవత్సరం మామిడికి సరైన ధరలు లేక చిత్తూరు జిల్లాలో మామిడిని రోడ్లపై పారవేసి రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారు. అది మొదలు ఏ పంటకు సరైన గిట్టుబాటు ధరలు లేవు. తాజాగా రాష్ట్రంలో రైతన్నలకు మరో పిడుగు లాంటి వార్త వినాల్సి వచ్చింది. టమాటా ధరలు పూర్తిగా పతనమయ్యాయి. కొద్దిరోజుల కిందట టమాటా కిలో రూ. 50 పలకగా ఇప్పుడు ఈ ధర దారుణంగా క్షీణించింది. ప్రతి ఫిబ్రవరి, మార్చిలో టమాటా ధర పెరగాల్సింది. కానీ ప్రస్తుతం ఈ పరిస్థితి రివర్స్ అయింది. మార్కెట్‌కు టమాటా సరఫరా అధికంగా రవాణా అవుతోంది. దీంతో టమోటా ఖరీదు అమాంతం పడిపోయింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో టమాటా ధరలు మరింతగా పడిపోయాయి. ఆసియా ఖండంలోనే టమోటా కు ప్రసిద్ధి పొందిన మదనపల్లె, తర్వాత ములకలచెరువు, పలమనేరు మార్కెట్లలో పది కిలోల టమాటా బాక్స్ రూ.90 నుంచి రూ.140 వరకూ పలుకుతుండగా గత ఏడాది ఇదే సమయానికి రూ. 300 నుంచి రూ. 600 వరకు పలికింది. ఆ ధరలతో పోల్చితే ఇది చాలా తక్కువ అని చెబుతున్నారు.

### వ్యాపారులు సైతం...

మరో వైపు వ్యాపారులు కిలోకు రూ. 10 కూడా పెట్టడం లేదు. పక్క రాష్ట్రాల నుంచి టమాటా భారీగా దిగుబడి అవుతోంది. కిలో రూ. 5 మాత్రమే చెల్లిస్తుండటంతో రైతులు లబోదిబో మంటున్నారు. కూలీలతో తెప్పించి మార్కెట్ కు తీసుకెళ్లడంతో ఆయా ఖర్చులు కూడా రావడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. అటు కిరాయి కూడా మోపవుతోందని లబోదిబోమంటున్నారు. ఈ పరిస్థితి దాపురించడంతో పండించిన పంటను తోటల్లోనే వదిలేస్తున్నామని, మరి కొంత మంది ఉచితంగా ప్రజలకు పంచుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి టమాటా తోటలు సాగు చేశామని, తీరా రేటు పడిపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు. గత ప్రభుత్వ పాలన లో సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతన్నలను లాభాల బాటలో నడిపేందుకు అప్పటి వైసీపీ ప్రభుత్వం రైతుల వద్దనేకొని రైతులకు అధిక ధరలను చెల్లించింది. కానీ కూటమి ప్రభుత్వంలో అలా జరగటం లేదు. దీంతో రైతన్నలు అన్ని విధాలుగా నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతన్నలను లాభాల బాటలో నడపాలని కోరుచున్నాము.

## కాకినాడ పేలుడు ఘటనపై
# మిదున్ రెడ్డి దిగ్భ్రాంతి



**ఏపీ బ్యూరో, ఫిబ్రవరి 28 - (రిపబ్లిక్ న్యూస్) -** మదనపల్లి :- ఆంధ్రప్రదేశ్‌లో మరో భారీ పేలుడు సంభవించింది.. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన బాణసంచా తయారీ కేంద్రం పేలుడు ఘటన రాష్ట్రవ్యాప్తంగా పెను విషాదాన్ని నింపింది. ఈ ఘోర ప్రమాదంపై లోక్ సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట పార్లమెంటరీ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోజు వారి కార్మికులు ఒక్కసారిగా 20 మంది మృతి చెందడం తనను కలచివేసిందని, ప్రభుత్వం బాధితులను వెంటనే ఆదుకోవాలని కోరారు. బాణసంచా కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో 'సూర్యశ్రీ ఫైర్ వర్క్స్' యూనిట్‌లో భారీగా ఉత్పత్తి జరుగుతోంది. ఈ క్రమంలోనే ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో 20 మంది వరకు కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం అధికారులు ఏడుగురు మృతి చెందినట్లు ప్రాథమికంగా ధ్రువీకరించగా, శిథిలాల కింద మరికొందరు ఉండే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పేలుడు ధాటికి చుట్టుపక్కల ఇళ్లు ధ్వంసం కావడం అత్యంత విషాదకరమన్నారు. గాయపడిన వారందరికీ అత్యుత్తమ వైద్యం అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు..

# దౌర్జన్యంగా పట్టా భూమి కబ్జా

**కొందరు వ్యక్తులు కోర్టు ఆర్డర్ ధిక్కరణ**
**జై పరిటాల శ్రీరామ్ అంటూ బండలు నాటారు**
**అనంతలో భూ కబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తులు**
**పరిటాల కుటుంబానికి మచ్చతెచ్చేలా కుట్రలు**
**దిక్కు తోచని స్థితిలో భూ హక్కుదారుడు**




**అనంతపురం క్రైమ్, ఫిబ్రవరి 28,(రిపబ్లిక్ న్యూస్):** అనంతలో కొందరు వ్యక్తులు యదేచ్చగా భూ కబ్జాలకుపాల్పడుతున్నారు. ఏకంగా పట్టా భూమిని కబ్జా చేశారు.పట్టా భూమిలో కొందరు వ్యక్తులు బరితెగింపు అనంతపురం నగరంలో చోటుచేసుకుంది. ఎన్నో ఏళ్లుగా అనుభవంలో ఉన్న భూ హక్కుదారుడి భూములను దౌర్జన్యంగా భూ కబ్జా చేశారు.

**పట్టా భూమిలో దౌర్జన్యంగా బండలు**

ఎన్.ఆర్ కాలనీకి చెందిన కొంతమంది వ్యక్తులు అనంతపురం రూరల్ రాచన్నపల్లి రెవెన్యూ పరిధి 1987 లోని సీతారామ శర్మ లేఅవుట్ కు చెందిన సర్వే నంబర్ 183/1/2 లెటర్లలో 14,15 ఈ రెండు ప్లాట్లలో ఒక్కొక్క సెంటులో ఐదు సెంట్లు చొప్పున కలిసి 10 సెంట్ల భూమిలో దౌర్జన్యంగా జై పరిటాల సునీతమ్మ, శ్రీరామ్ అంటూ బండలు నాటారు. ఒక సామాజిక వర్గానికి చెందిన కొంతమంది పరిటాల అనుచరులమంటూ రాజకీయంగా కుట్రలు చేస్తున్నారు. పరిటాల కుటుంబానికి మచ్చ తీసుకురావడానికి వైసిపి నాయకులతో కుమ్మక్కై ఇలాంటి అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. పట్టా భూమిలో దౌర్జన్యంగా బండలు నాటినా కూడా రెవెన్యూ అధికారులు చోద్యం చేస్తున్నారు. అనేకమార్లు దౌర్జన్యం చేసిన ఒక సామాజిక వర్గ వ్యక్తులపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు ఫిర్యాదు చేసిన కూడా అధికారులకు చలనం రాలేదు. భూ యజమానికి అనుకూలంగా జిల్లా కోర్టు తీర్పునిచ్చింది. అయినా కూడా ఒక సామాజిక వర్గం వ్యక్తులు రెచ్చిపోయి దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. వారిపై పోలీసులు వెంటనే తగిన చర్యలు చేపట్టాలి. జిల్లా కలెక్టర్ చొరవచూపి భూ హక్కుదారులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి.

# గంజాయి అక్రమ రవాణా వినియోగంపై ప్రత్యేక దృష్టి

**ఎస్సై మహేష్ నాయుడు.**

**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్.**

గంజాయి అక్రమ రవాణా చేయడాన్ని గంజాయి తాగడం పై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ మహేష్ నాయుడు శనివారం పత్రిక ప్రకటనలోతెలిపారు,ఓబులవారిపల్లి మండలంలోని మంగంపేట పంచాయతీలోని ఒకటవ మరియు రెండవ వీధుల్లో కార్డన్ అండ్ సెర్చింగ్ ఆపరేషన్ రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఆధ్వర్యంలో వజ్ర ప్రహర్ లో భాగంగా రైల్వే కోడూరు సబ్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రెడ్డి ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ మహేష్ నాయుడు మరియు కోడూరు రూరల్ సిబ్బంది కలిసి ఈ ఆపరేషన్ నిర్వహించడం జరిగినది, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఉత్తర్వుల మేరకు, రేణిగుంట డి.ఎస్.పి శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ నిర్వహించామని ఎస్ఐ మహేష్ నాయుడు తెలియజేశారు, యువత మాదకద్రవ్యాలకు బానిసలై తప్పుదారిన పడుతున్నారని వారిని సరైన మార్గంలో పెట్టడానికి సమాజంలో బాధ్యతగల పౌరులుగా మెలగడానికి ఆపరేషన్ నిర్వహించామని అన్నారు,

ఈ ఆపరేషన్‌లో ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణా, నిల్వ మరియు వినియోగాన్ని అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించి, అనుమానాస్పద వ్యక్తుల, వాహనాలు మరియు వారి గృహాలను సైతం సమగ్రంగా తనిఖీ చేయడం జరిగింది. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు సమాజంలో నేరాల పెరుగుదలకు కారణమవుతున్నందున, వాటి నిర్మూలనకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు




చేపడుతున్నారని .అదేవిధంగా, ప్రజలకు గంజాయి అమ్మకం, నిల్వ మరియు వినియోగం చట్టవిరుద్ధమని, అలాంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠినమైన, చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని, యువత తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా మీ బిడ్డల పట్ల వ్యవహరించాలని, మీ పిల్లలు కళాశాలలకు సక్రమంగా వెళుతున్నారా లేదా ఎన్ని గంటలకి ఇంటికి వస్తున్నారు ఏమి చేస్తున్నారు ఎక్కడ తిరుగుతున్నారు వారిపై దృష్టి నిలపాలని తద్వారా వారిని మంచి మార్గంలో పెట్టేందుకు మంచి భవిష్యత్తులో నడిపించేందుకు అవకాశం ఉంటుందని ఈ అవగాహన సదస్సులో రూరల్ సీఐ శ్రీనివాసులు వారికి అవగాహన కల్పించారు,,గంజాయి సంబంధిత సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని ప్రజలకు అర్బన్ సీఐ చంద్రశేఖర్ వారికి సూచించారు.

అలాగే మహిళలపై నేరాలు, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు మరియు దొంగతనాల నివారణపై రైల్వే కోడూరు సబ్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రెడ్డి పట్టుబడ్డ వాహనదారులకు అవగాహన కల్పించారు.

జిల్లాలో గంజాయి నిర్మూలన మరియు శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తూ






నిరంతరం ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తామని ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని హెల్మెట్ ధరించడం తప్పనిసరిని ఈ విషయంలో ఆజాగ్రత్త వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముందు జాగ్రత్తగా ప్రజలకు,ద్విచక్ర వాహనదారులకు హెచ్చరిస్తున్నామని ఎస్సై మహేష్ నాయుడు తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న వినియోగిస్తున్న తెలిసిన ప్రజలు పోలీసులకు సహకరించి గంజాయి రహిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

# కోటూరులో ఘనంగా సైన్స్ దినోత్సవం



**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 28 రిపబ్లిక్ పబ్లిక్ న్యూస్**

మండలంలోని పెద్ద కొండా మారి పంచాయతీ కోటూరు పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు మండల విద్యాధికారులు కేశవరెడ్డి తిరుమలమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులలో దాగి ఉన్న విజ్ఞానాన్ని వెలికి తీయడమే విజ్ఞాన మేళాలో కోటూరు విద్యార్థులు తమ యొక్క ప్రతిభను ప్రదర్శించి 11 బహుమతులకు గాను ఆరు బహుమతులు గెలుచుకోవడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన అన్నారు భారత జాతీయ భౌతిక శాస్త్రవేత్త సర్ సివి రామన్ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు ఆయన వివరించారు విద్యార్థుల్లో మూఢనమ్మకాలను తొలగించి సైన్స్ పట్ల అవగాహన తాత్విక ఆలోచనను పెంపొందించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తేజస్విని రమణ భాగ్యలక్ష్మి శివకుమార్ రమణమ్మ షాహిన్ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు. విజ్ఞాన మేళాలో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

# లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ల పంపిణీ

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**
**రూరల్ పరిధి ఉప్పరపల్లిలో ఎన్టీఆర్ భరోసా**
**పెన్షన్లను పంపిణీ చేసిన కలెక్టర్**

**అనంతపురం రూరల్ సంక్షేమం, ఫిబ్రవరి 28,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేసే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొని స్వయంగా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో పెన్షన్ వల్ల ఉపయోగం ఉందా, ఒకటవతేదీ పెన్షన్ వస్తోందా, సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ ఇస్తున్నారా, మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా, తదితర వివరాలను ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ ఇస్తున్నారని, పెన్షన్ డబ్బులు తమకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

**డయాలసిస్ లబ్ధిదారురాలికి పెన్షన్ 10 వేలు**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా



ఒకటవ తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేయడం జరుగుతోందని, మార్చి నెల ఒకటవతేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగానే 28వ తేదీనే పెన్షన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో సజావుగా పెన్షన్ల పంపిణీ చేపట్టడం జరుగుతోందని తెలిపారు. పెన్షన్ల పంపిణీ పూర్తి స్థాయిలో చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు పలు సమస్యలను తెలియజేయగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందులో జూటూరు పెద్దక్క అనే డయాలసిస్ లబ్ధిదారురాలికి పెన్షన్ కింద 10 వేల రూపాయలను, బండి రోగప్ప అని లబ్ధిదారుడికి వృద్ధాప్య పెన్షన్ 4,000, బండి లక్ష్మీదేవి అనే లబ్ధిదారురాలికి వితంతు పెన్షన్ కింద 4 వేల రూపాయలను, పి.సింహకు వికలాంగుల పెన్షన్ 6,000 రూపాయలు, జూటూరు కొండమ్మకి వితంతు పెన్షన్ 4 వేల రూపాయలను, కుమ్మర బాలాంజనేయులు అనే లబ్ధిదారుడికి వికలాంగ పెన్షన్ 6,000 రూపాయలు జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెన్షన్ అందజేయడం పట్ల లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోహన్ కుమార్, ఎంపిడిఓ దివాకర్, గ్రామ సర్పంచ్ సావిత్రి, ఎంపీటీసీ నాగలక్ష్మమ్మ, ఆర్ఐ సందీప్, మండల సర్వేయర్ రఘు, సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో వెంకట్ నాయుడు, శ్రీధర్ రావు , పంచాయతీ అభివృద్ధి అధికారి వర్ల శంకర్, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, సిబ్బంది, గ్రామ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గోవిందు, ముత్యాలు, నరేష్, శివ, కొండన్న తదితరులు పాల్గొన్నారు.

# ఏడుగురు పేకాటరాయులపై కేసు నమోదు

**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్**

ఏడుగురు పేకాట రైళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిన్నారెడ్డప్ప తెలిపారు. ఆయన కథనం మేరకు... చౌడేపల్లి పరిధిలోని గోసల కురుపల్లిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది వెంటనే పేకాట స్థావరంపై దాడులు చేయగా ఏడుగురు వ్యక్తులతో పాటు రూ 74650,లు 5 సెల్ ఫోన్లు, ఒక టూ వీలర్ ను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లాలో ఉపాధి హామీ పనుల వేగవంతం చేయండి

**జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి,ఫిబ్రవరి 28: (రిపబ్లిక్ న్యూస్)**

ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో పని దినాల సంఖ్యను గణనీయంగా పెంచాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్, అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా అధికారులతో నిర్వహించిన వెబెక్స్ మీటింగ్‌లో ఆయన పలు కీలక సూచనలు చేశారు. సోమవారం నుండి జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ ఒక లక్ష పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోవాలి. గ్రామ పంచాయతీలు, ఆవాస ప్రాంతాల్లో కూలీలను సమీకరించి, నిర్దేశించిన టార్గెట్‌ను ప్రతి మండలం చేరుకోవాలి.విధుల్లో నిర్లక్ష్యం వహించి, ప్రగతి సాధించని అధికారులపై శాఖ పరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. గత ఏడాది 19,508 కుటుంబాలు 100 రోజుల పని పూర్తి చేసుకోగా, ఈ ఏడాది ఆ సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖలో పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేసి, ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ ఎస్.ఈ స్ ఇ తో సమీక్ష నిర్వహించి, 'వర్క్ క్లోజర్' (వర్క్ క్లోసరే ) ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.గత ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యాలను ఈ సంవత్సరం1 తప్పనిసరిగా అధిగమించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను



యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది. ఆర్.డబ్ల్యూ.ఎస్ ఎస్.ఈ ఎస్ ఎస్ సి క్షేత్రస్థాయిలో ఉన్న పురోగతిని పర్యవేక్షించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ విజయ ప్రసాద్, ఎస్ఈ మురళి, ఏపీడీలు, అన్ని మండలాల ఎంపీడీఓలు మరియు ఏపీవోలు పాల్గొన్నారు.

# గుట్టపాడు గ్రామంలో సిగాచి మందుల ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకించండి



**ఓర్వకల్లు ప్రతినిధి, ఫిబ్రవరి 28, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఓరకల్లు మండలం గుట్టపాడు గ్రామంలో శివాజీ మందుల ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకించి ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా ప్రజలు ఉద్యమించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ విద్యావంతుల ఐక్యవేదిక కార్యదర్శి భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు శనివారంరోజు ఓరకల్లు మండలంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం జరిగినది ఈ సమావేశంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ విద్యావంతుల ఐక్యవేదిక నాయకులు భాస్కర్ రెడ్డి రత్నం ఏసేపు పాల్గొని మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా గోరకల్లు మండలం గుట్టపాడు గ్రామంలో మరియు మీది వేముల గ్రామంలో సంయుక్తంగా భారీ మండల ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు పూనుకోవడం ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా నిర్ణయించడం తీవ్రమైన ఆ క్షేపనీయమని వారు తెలిపారు భారీ మందల పరిశ్రమ ఏర్పాటుకు పర్యావరణ అనుమతులలో కూడా పెద్ద డ్రామా జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు గతంలో ఘోర ప్రమాదం జరిగిన చరిత్ర సిగాజి సంస్థకు ఉన్నదని అటువంటి సంస్థకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము అనుమతిని సులభంగా ఇవ్వడం పర్యావరణ వేత్తలు శాస్త్రవేత్తలు తమ నిరసనను తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు సిగాసి పరిశ్రమ వల్ల జరిగే ఎటువంటి దుష్ప్రభావాలను గురించి వివరించేందుకు నాలుగు మూడు 2026 తేదీన మండలంలోని ప్రజలందరికీ అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని సదస్సులో రైతులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు పిలిపించారు సదస్సు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ అధ్యక్షతన జరుగుతుందని ఈ సదస్సులో పర్యావరణ నాయకులు కన్వీనర్ రామకృష్ణారెడ్డి విద్యావంతుల వేదిక నాయకులు భాస్కర్ రెడ్డి రత్నమయ్య ఏసేపు మరియు అనేకమంది ఇప్పుడు నువ్వు పాల్గొంటారని సదస్సులో పాల్గొని పరిశ్రమ వల్ల కలిగే ఎటువంటి దుష్ప్రభావాన్ని అవగాహన చేసుకుని రాబోయే కాలంలో ప్రాణాంతకమైనటువంటి రసాయన పరిశ్రమలకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు షాజహాన్ శ్రీధర్ సిఐటియు నాయకులు దస్తగిరి రైతు నాయకులు వెంకటేశ్వర్లు వాడాల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# జిల్లా వ్యాప్తంగా 'ఆపరేషన్ వజ్ర ప్రహర్'

## ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో కార్డన్ సెర్చ్‌లు నాటుసారా, అక్రమ మద్యం స్వాధీనం







**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 28)**
రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న 'ఆపరేషన్ వజ్ర ప్రహర్'లో భాగంగా కర్నూలు జిల్లా పోలీస్ అధికారులు జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ల పరిధిలోని గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు.ఎమ్మిగనూరు సబ్‌డివిజన్‌లో పెద్దకడుబూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాలవాడి గ్రామంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ భార్గవి, కోసిగి సర్కిల్ సీఐ మంజునాథ్, చంద్రబాబు, పెద్దకడుబూరు ఎస్సై నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనుమానిత ప్రాంతాలు, అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి పంటపొలాల్లో గంజాయి సాగు, నాటుసారా తయారీ, అక్రమ మద్యం విక్రయాలు, గుట్కా నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలో అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను అధికారులు కోరారు.ఇక ఆదోని సబ్‌డివిజన్ పరిధిలో వాల్మీకి నగర్‌లో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో 10 లీటర్ల నాటుసారా, 12 మద్యం సీసాలు, నంబర్ ప్లేట్ లేని రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలలో సీఐలు రాజశేఖర్ రెడ్డి, నల్లప్ప, రామలింగమయ్య, చంద్రశేఖర్, ఎస్సైలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కార్యాలయంపై దాడి చేసిన బీజేపీ కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలి

## ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని జిల్లా ఎస్పీకి మాజీ ఎమ్మెల్సీ ఎం. సుధాకర్ బాబు విజ్ఞప్తి



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 28)**
కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన బీజేపీ కార్యకర్తలను వెంటనే అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు ఎం. సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.
కర్నూలు జిల్లా చరిత్రలో ఒక రాజకీయ పార్టీ కార్యాలయంపై మరో పార్టీ దాడి చేయడం ఇదే తొలిసారి అని ఆయన పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యాలయంపై దాడి చేసి గేట్లు విరగొట్టి, ఫ్లెక్సీలు చింపి విధ్వంసం సృష్టించినప్పటికీ ఇప్పటివరకు అరెస్టులు చేయకపోవడం ఎందుకని ఎస్పీని ప్రశ్నించారు. ఢిల్లీలో జరిగిన ఏఐ సమ్మిట్ సందర్భంగా నిరసన తెలిపిన యూత్ కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారని గుర్తుచేశారు. ఒక నిందితుడు దొరకకపోవడంతో హిమాచల్ ప్రదేశ్‌కు వెళ్లి అరెస్టు చేసిన పోలీసులు, కర్నూలులో జరిగిన ఈ ఘటనపై అదే నిబద్ధత ఎందుకు చూపడం లేదని ఆయన ప్రశ్నించారు.
ఇలాంటి దాడులకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ లేదా రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ప్రత్యక్ష ధర్నా చేపడతామని హెచ్చరించారు. పోలీసుల సమక్షంలోనే ఘటన జరిగినప్పటికీ అరెస్టులు జరగకపోవడం విచారకరమని అన్నారు.
ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాషా, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బి. బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్‌సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఐఎన్‌టీయూసీ సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# యం.వి. ఫౌండేషన్ పూర్వ విద్యార్థుల, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం









**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి, 28,(రిపబ్లిక్ న్యూస్ )**
చదువుల తల్లి శాంతసిన్హా గారి స్ఫూర్తిదాయక సందేశం 300 మంది ఉపాధ్యాయులు, విద్యార్థుల పాల్గొనడం
ఈరోజు నిర్వహించిన విద్యా సదస్సుకు ముఖ్య అతిథిగా పద్మశ్రీ, రామన్ మెగసేసే అవార్డు గ్రహీత, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ చైర్పర్సన్ శాంతసిన్హా విచ్చేసి కార్యక్రమాన్ని శోభాయమానం చేశారు.
సుమారు 300 మంది ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్న
పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి సమావేశానికి సభ అధ్యక్షులు అరుణ కుమారి ఎస్ విజయభాస్కర్ ఈ సమావేశంలో శాంతసిన్హా గారు బాలల హక్కులు, సమాన విద్యావకాశాలు, బాల కార్మిక నిర్మూలన వంటి అంశాలపై స్ఫూర్తిదాయక ఉపన్యాసం అందించారు.
విద్య ప్రతి బాలుడి హక్కు అని, సమాజంలో మార్పు తీసుకురావాలంటే ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన స్వప్నాలను నెరవేర్చుకునేలా విద్యా వ్యవస్థ బలోపేతం కావాలని ఆమె ఆకాంక్షించారు. యం వి
ఫౌండేషన్ నేషనల్ కోఆర్డినేటర్ వెంకటరెడ్డి గ ఎం వి ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ జె భాస్కర్ యంవి ఫౌండేషన్ హరిహర రెడ్డి లక్ష్మీనారాయణ, మాధవ కృష్ణ రంగనాథ్ పూర్వపు ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు
కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమె సందేశాన్ని ఆసక్తిగా ఆలకించారు. చివరగా నిర్వాహకులు శాంతసిన్హా ని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్టీఆర్ పింఛను భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించిన గువ్వల




**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్**
అవ్వ తాతలకు మనవడిలా వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపే విధంగా కూటమి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకొంటున్నారని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి అన్నారు.మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీలోని గ్రామాల్లో ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఒకరోజు ముందుగానే అందించడం కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు అనంతరం కూటమి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

# పోటీ ప్రపంచంలో టైలర్ లను ఆదుకోవాలి




**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్**
ప్రస్తుత రెడీమేడ్ పోటీ ప్రపంచంలో ప్రభుత్వం టైలర్లను ఆదుకోవాలని సంఘ నాయకులు హైదర్, మహిళా దర్జీల సంఘం నాయకురాలు సయ్యద్ సురాజీన్ బి లు అన్నారు. అంతర్జాతీయ దర్జీల దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక గాంధీ వీధిలోని గాంధీ బొమ్మ వద్ద కుట్టు మిషన్ కనిపెట్టిన విలియం ఎలియాస్ హోవే చిత్రపటాన్ని ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. సమాజంలో రెడీమేడ్ దుస్తుల హవా కొనసాగుతోంది అని బజ్జీలు బతుకులు నేల చూపులు చూస్తున్నాయని అన్నారు ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో మండలంలోని దర్జీలు,మహిళా దర్జీలు పాల్గొన్నారు.

# రామచంద్రపురం బస్ స్టాప్ వద్ద డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం తరలింపుపై తీవ్ర వ్యతిరేకత



**ఆందోల్ ప్రతినిధి ఫిబ్రవరి 28( రిపబ్లిక్ న్యూస్)**
రామచంద్రపురం (ఆర్సి పురం) బస్ స్టాప్ సమీపంలో, అంబేద్కర్ క్రాస్ రోడ్స్‌గా ప్రసిద్ధి చెందిన ప్రాంతంలో గత అనేక సంవత్సరాలుగా ఉన్న Dr. B. R. Ambedkar గారి విగ్రహాన్ని ఇక్రిసెట్ గేట్ పక్కన ఉన్న నిర్మానుష్యమైన రైల్వే స్థలానికి తరలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను రామచంద్రపురం ప్రజలు, అంబేద్కర్ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ విగ్రహం బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు మైనారిటీ వర్గాల ప్రజలు తమ సొంత నిధులతో ఐక్యతగా ప్రతిష్టించినది. ఇది రామచంద్రపురం ప్రాంతానికి గుర్తింపుగా నిలిచిన విగ్రహం మాత్రమే కాకుండా, సామాజిక ఐక్యతకు నిదర్శనం కూడా.

### స్థలం ఉన్నప్పటికీ తరలింపు ఎందుకు?

ప్రస్తుతం ఉన్న స్థలంలోనే, రోడ్డు పనులకు ఎలాంటి అంతరాయం కలగకుండా, నెహ్రూ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విధంగానే అంబేద్కర్ విగ్రహాన్ని కొద్దిగా వెనక్కి జరిపి ఏర్పాటు చేయడానికి తగిన స్థలం స్పష్టంగా అందుబాటులో ఉంది. అయినప్పటికీ, తప్పుడు సమాచారం ఆధారంగా స్థానిక ఎమ్ఎల్ఏ గూడెం మహిపాల్ రెడ్డి విగ్రహాన్ని ఇక్రిసెట్ గేట్ పక్కకు తరలించాలని ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**మంత్రి హామీని కూడా లెక్క చేయకపోవడం**

ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి గారికి తెలియజేయగా, ఆయన వెంటనే నేషనల్ హైవేస్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌ను సంప్రదించి, ప్రస్తుత స్థలం దగ్గరే విగ్రహాన్ని కొనసాగిస్తామని హామీ తీసుకున్నారు. అయినా కూడా, స్థానిక ఎమ్ఎల్ఏ ఒత్తిడితో నేషనల్ హైవే అధికారులు మరియు పోలీసులు ఇక్రిసెట్ గేట్ పక్కన తరలించడానికే పట్టుబడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**పోలీసుల ఒత్తిడి ప్రజాస్వామ్యానికి విరుద్ధం**

గత మూడు రోజులుగా పోలీసులు రామచంద్రపురం వాసులపై, విగ్రహాన్ని నిర్మానుష్యమైన రైల్వే స్థలంలో పెట్టడానికి అంగీకరించాలని ఒత్తిడి తెస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్య విలువలకు, సామాజిక న్యాయానికి విరుద్ధమని వారు పేర్కొంటున్నారు.

### ప్రజల స్పష్టమైన డిమాండ్

ఆర్సి పురం బస్ స్టాప్ దగ్గరే అంబేద్కర్ విగ్రహం కొనసాగాలి
విగ్రహాన్ని పూర్తిగా తొలగించే లేదా నిర్మానుష్య ప్రాంతానికి తరలించే ప్రయత్నాలు నిలిపివేయాలి
దళితులు, బీసీలు, మైనారిటీల భావోద్వేగాలను గౌరవించాలి
రామచంద్రపురం ప్రజలు మరియు అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు, ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.
రామచంద్రపురం ప్రజలు & అంబేద్కర్ సంఘం ప్రతినిధులు(సుంకు వినయ్ కుమార్, కావాలి సంజీవ, రాజయ్య, బాలనరసింహ, నరసింహ,. రాజేష్, ఎడ్ల రమేష్, సురేందర్,సుంకు సాయి, ప్రసాద్, నర్సింగ్ రావు, సంజీవ్ కుమార్ మహిళలు మరియు ఇతరులు

# నాల్గవ రోజు ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియట్ రెండవ సంవత్సర పరీక్షలు

### ఇంటర్మీడియట్ విద్యాధికారి- మాధవి



**మెదక్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 28( రిపబ్లిక్ న్యూస్)**

ఈరోజు జరిగిన ఇంటర్మీడియట్ రెండవ సంవత్సర ఇంగ్లీష్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయి. రెండవ సంవత్సర పరీక్షలలో జనరల్ విభాగం లో 4869 గాను 4799 విద్యార్థులు హాజరైనారు. ఒకేషనల్ విభాగంలో 540 గాను 525 విద్యార్థులు పరీక్షకు హాజరైనారు.

జిల్లాలో నాలుగవ రోజు హాజరు శాతం 98.42 % గా నమోదైంది. ఈ సంవత్సరం ఐదు నిమిషాలు నిబంధన అమలు లో ఉండటంతో విద్యార్థులందరూ సమయానికి పరీక్షా కేంద్రాల కు చేరుకున్నారు. జిల్లాలో ఉన్న పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం పర్య వేక్షించారనీ ఒక ప్రకటనలో తెలిపారు.

# కలెక్టర్ రాహుల్ రాజ్ కు ఘనంగా శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికిన మెదక్ జిల్లా రిపబ్లిక్ న్యూస్ రిపోర్టర్ ఎం బుచ్చయ్య







**మెదక్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 28( రిపబ్లిక్ న్యూస్)**

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు జిల్లాలోని ఉద్యోగులు,ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు.

పూలమాలలు శాలువాలు వివిధ జ్ఞాపకాలతో కలెక్టర్ గారితో పనిచేసిన కాలాన్ని గుర్తుకు చేసుకున్నారు.

జిల్లా కలెక్టర్ విద్య వైద్యంలో జిల్లాలో సమూల మార్పులు తీసుకొచ్చారని పలువురు జిల్లా అధికారులు పునరుద్ఘాటించారు. విద్య వైద్యం ప్రధానోజెండాగా కలెక్టర్ రాహుల్ రాజ్ రెండు సంవత్సరాల కాలం బిజీ బిజీగా గడిచిపోయిందని పలువురు తెలిపారు.

ప్రజలకు ఉద్యోగులకు పలు సలహాలు సూచనలు



ఇస్తూ మార్గదర్శకులుగా ఏ చిన్న సమస్యనైనా అలవోకగా పరిష్కరించి పలువురి మన్ననలు పొందాడని జిల్లా అధికారులు అన్నారు.

పూర్వపు కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఇక్కడి ప్రజలతో తనకు విడదీయరాని బంధం ఏర్పడిందని, ఇక్కడి నుండి వెళ్లడం బాధాకరమైన హృదయంతో వెళ్తున్నట్లు తెలిపారు. తనకు సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

కలెక్టర్ ను, వారి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంలో పూలు చల్లుతూ కలెక్టర్ కార్యాలయం నుంచి మెయిన్ గేటు వరకు తీసుకెళ్లి శుభాకాంక్షలు తెలియజేస్తూ వీడ్కోలు పలికారు.

### ప్రజలకు సేవ చేయడానికి నన్ను ఆ దేవుడు పంపించిన శిష్యునిగా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి

# ప్రతి సమస్యను పరిష్కారం చేస్తా

**ఆకుల సత్యనారాయణ( చిట్టి బాబు ) జోగుపేట మున్సిపల్ వైస్ చైర్మన్**





**అందోల్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి 28( రిపబ్లిక్ న్యూస్ )**

అయ్యప్ప స్వామి మాల నన్ను ఆశీర్వదించింది , గణనాథుడు నన్ను గట్టెక్కించాడు, అని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) అన్నారు.

ప్రజల ఆశీర్వాదమే కాకుండా దేవుళ్ళ దీవెనలు నిండుగా ఉన్నాయని ఆయన అన్నారు.

అంతేకాకుండా ప్రజల సమస్యలు,నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు గాని , ప్రభుత్వ పథకాలు గాని ప్రజలకు అందే విధంగా కృషి చేస్తానని వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) అన్నారు.

### అర్హులైన పేదలకు ఇచ్చినటువంటి ఇండ్ల స్థలాలను ఇవ్వమని అడిగితే పోలీసుల దౌర్జన్యం

# పోలీసుల అరాచకం అరికట్టాలి పేదలకు న్యాయం చేయాలి

**ఆందోల్ ప్రతినిధి ఫిబ్రవరి 28( రిపబ్లిక్ న్యూస్ )**

సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డి పల్లి చౌరస్తా లోని సర్వేనెంబర్ 153/4 153/5 153/25 విస్తీర్ణం 3-20 గల భూమిలో 2007 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం లో ఉన్నటువంటి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గారి ఆధ్వర్యంలో పేదలకు 80 మంది కుటుంబాలకు పట్టా సర్టిఫికెట్లు జారీ చేయడం జరిగింది. మరియు పొజిషన్ కూడా చూపించడం జరిగింది. కానీ అక్కడ మౌలిక వసతులు లేనందున లబ్ధిదారులు అక్కడ నివాసం చేయలేకపోయినాను ప్రస్తుతం అక్కడ మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్న సందర్భంలో రోడ్లు వేసి కడీలు పాతడం లాంటి పనులను తెలియకుండా చేస్తున్నారు కాబట్టి దీన్ని రెవెన్యూ అధికారులు గుర్తించి అక్కడ



జరుగుతున్నటువంటి పనులను నిలుపుదల చేసి వాస్తవమైన నిరుపేదలైన పట్టాదారులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది చాలా సందర్భాలలో ఎమ్మార్వో ఆర్డీవో కలెక్టర్ గారు సంప్రదించి ఇట్టి విషయాన్ని చాలా సందర్భాలలో వారికి దరఖాస్తులు విన్నవించడం జరిగింది





# ఎపిలో జోరుగా పెన్షన్ల పంపిణీ

### విజయనగరంలో సిఎం చంద్రబాబు హాజరు

### పాలకొల్లులో మంత్రి నిమ్మల పంపిణీ

**అమరావత్లి, ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్.**

:ఏపీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శరవేగంగా సాగుతోంది. మార్చి1 ఆదివారం సెలవు కావడంతో ఒకరోజు ముందుగానే అంటే శనివారం పింఛన్లను పంపిణీ చేపట్టారు. ఉదయం 11 గంటల నాటికి సుమారు 82 శాతం మేర పింఛన్లు అందజేశారు. ప్రభుత్వం 62.76 లక్షల మంది లబ్దిదారులకు రూ. 2,725 కోట్లు విడుదల చేసింది. ఇప్పటి వరకు 51.86 లక్షల మందికి పింఛన్లు పంపిణీ అయ్యాయి. స్వర్ణవార్డు, స్వర్ణగ్రామ సిబ్బంది.. లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదుగా అందజేస్తున్నారు. ముఖ్యమంత్రి



నారా చంద్రబాబు నాయుడు విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావివలస గ్రామంలో అక్కడ లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేపట్టారు. మరోవైపు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. వృద్ధురాలికి పింఛన్ అందజేసి ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలకు జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యేలు ముఖం చాటేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. అసెంబ్లీ నుంచి ఎస్కేప్, శాసనమండలికి వాకౌట్, రోడ్డుపై రప్పా రప్పా సంస్కృతి వైసీపీదని విమర్శించారు. 2029లో అధికారంలోకి వస్తే రాక్షసత్వం ప్రదర్శిస్తా మన్న వైసీపీ వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. మానవత్వంతో పనిచేసే కూటమి ప్రభుత్వమా లేక రాక్షసత్వం గల వైసీపీనా అని ప్రజలు తేడా బేరీజు వేసుకోవాలన్నారు. జగన్.. ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకోకుండా తప్పిదాలు చేస్తున్నారని తెలిపారు. పురాణకాలంలో యజ్ఞాలను అడ్డుకున్న రాక్షసుల్లా నేడు అభివృద్ధిని, మంచి కార్యక్రమాలను అడ్డుకునే దుష్టశక్తిగా వైసీపీ తయారైందంటూ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యలు చేశారు.

# మరోమారు భగ్గుమన్న పుత్తడి ధరలు

### పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యుల బెంబేలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్.**

దేశంలో బంగారం, వెండి ధరలు సామాన్యుల అంచనాలకు అందని విధంగా మారుతున్నాయి. రెండు రోజుల పాటు దాదాపు స్థిరంగా కొనసాగిన ధరలు శనివారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో బంగారం ధర సగటున రూ.3 వేల మేర పెరగ్గా వెండి ధర కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఎగబాకింది. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యులకు ధరలు కంగారు పెట్టిస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,64,730లకు చేరుకుంది. నిన్నటి ముగింపు ధరతో పోలిస్తే ఏకంగా రూ.3,160ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ పసిడి ధర కూడా రూ.2,900ల మేర పెరిగి రూ.1,51,000లకు చేరుకుంది. నగరంలో వెండి ధర కూడా రూ.5 వేల మేర పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3 లక్షలుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర గరిష్ఠంగా రూ.1,65,820కు చేరింది. ముంబై, కర్ణాటక, బెంగళూరు నగరాల్లో మేలిమి బంగారం ధర రూ.1,64,730గా ఉంది. ఢిల్లీలో రూ.1,64,880ల వద్ద కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర (10 గ్రాములు) చెన్నైలో రూ.1,52,000గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,51,000 వద్ద కొనసాగుతోంది. నగరాల వారీగా వెండి ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో కిలో వెండి ప్రస్తుతం రూ.3 లక్షలకు చేరుకుంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.2.95 లక్షల వద్ద కొనసాగుతోంది.

# 27నుంచి ఒంటిమిట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు

### బుక్‌లెట్‌ను విడుదల చేసిన టిటిడి చైర్మన్ -పరాభవనామ పంచాంగం ఆవిష్కరణ

**తిరుమల్ల, ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్.**

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఈవో ఎం.రవిచంద్రతో కలిసి తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆవిష్కరించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో శనివారం బోర్డు సమావేశం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. మార్చి 27 నుంచి ఏప్రిల్ 5 వరకు ఒంటిమిట్ట శ్రీ కోందండరామాలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1న రాష్ట్ర పండుగగా శ్రీ సీతారాముల కల్యాణాన్ని తితిదే అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తితిదే




అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి.వీరబ్రహ్మం, డా.ఎ.శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, పలువురు బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సకల ఐశ్వర్యాలు సమకూరాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ధర్మ ప్రచారంలో భాగంగా తితిదే ప్రతి ఏడాది ఉగాది నాటికి పంచాంగాలను ముద్రించి అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాబోయే శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని ఆకర్షణీయంగా ముద్రించింది. పంచాంగాన్ని తితిదే ఆస్థాన సిద్దాంతి తంగిరాల వేంకటకృష్ణ పూర్ణ ప్రసాద్ సిద్ధాంతి రచించారు. రాజాధి నవనాయకుల ఫలితాలతోపాటు రాశిఫలాలు, వధూవర గుణమేళనం, వివాహాది సుముహూర్త నిర్ణయాలు, తితిదేలో నిర్వహించే విశేష ఉత్సవాలు తదితర విషయాలను చక్కగా వివరించారు.

# కంకర, డస్ట్ అధిక లోడ్ల వల్ల ప్రమాదాలు


### ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు




**కుప్పం, ఫిబ్రవరి 28, (రిపబ్లిక్ న్యూస్):** కుప్పం మండలం ఆవులనత్తం గ్రామంలో ఉన్న జి.బి.ఎం క్రషర్ లో వాహనానికి మించి అధిక లోడుతో రోడ్డుపైకి వస్తే వెనుక నుండి వస్తున్న వాహన చోదకుల కళ్ళలోకి డస్ట్ పడడంతో పాటు, కంకర రాళ్ళు మలుపుల వద్ద చిందించుకుంటూ పోవడంతో వాహన చోదకులు అదుపు తప్పుతున్నామని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు వీటిపై స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రిపబ్లిక్ న్యూస్ కి స్పందన

## ముక్కా ఫౌండేషన్ తరపున చామర్తి కుటుంబానికి ఆర్థిక సాయం.



**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్.**



రైల్వే కోడూరు మండలం చియ్యవరం పంచాయతీ కె ఆర్ కండ్రిక గ్రామానికి చెందిన చామర్తి దశరథ రాజు ఫిబ్రవరి 17న కాలం చెందిన సంగతి విధితమే ఆ కుటుంబానికి కూడా చైర్మన్ రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించిన సందర్భంగా ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇవ్వడం జరిగినది ఈ నేపథ్యంలో శనివారం చామర్తి దశరథ రాజు స్వగృహానికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు,ఆ కుటుంబ సభ్యుడు రాజ శేఖర్ రాజును కలిసి 75 వేల రూపాయల ఆర్థిక సాయం ముక్కా ఫౌండేషన్ తరపున అందజేయడం జరిగినది, రూపానంద రెడ్డి మాట్లాడుతూ చామర్తి మరణించడం మీ కుటుంబానికి తీరని లోటని ప్రభుత్వం తరపున ఏమైనా ఆర్థిక సహాయం అందే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆర్థిక సహాయం అందే విధంగా చూస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగినది.

## జ్యూడిషియల్ అకాడమీకి నేడు శంకుస్థాపన

**అమరావత్రి, ఫిబ్రవరి 28 రిపబ్లిక్ న్యూస్.**

రాజధాని అమరావతిలో ఆదివారం జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేయనున్నారు. తుళ్లూరు మండలం దొండపాడు సమీపంలోని ఈ -4,ఎన్16 జంక్షన్ వద్ద 6.5 ఎకరాల్లో రూ165 కోట్ల వ్యయంతో జుడీషియల్ అకాడమీ నిర్మాణం జరగనుంది. ప్రస్తుతం మంగళగిరిలోని అద్దె భవనంలో జ్యుడీషియల్ అకాడమీ కొనసాగుతోంది. హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్,సీఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్,ఇతరులు హాజరుకానున్నారు. అకాడమీ శంకుస్థాపనకు సంబంధించిన ఏర్పాట్లలో ప్రభుత్వం యంత్రాంగం నిమగమైంది.

# మాదాల శ్రీనివాసులు నేటి జర్నలిస్టులకు స్ఫూర్తి -ఖండే శ్యామ్

## ఘన నివాళులర్పింపించిన నంద్యాల జర్నలిస్టులు

**నంద్యాల ఫిబ్రవరి 28 ( రిపబ్లిక్ న్యూస్) :**



మాదాల శ్రీనివాసులు మన మధ్యలో లేదని ఉహించుకోవడానికే బాధగా ఉందని, ఆయన లేని లోటు జర్నలిస్టులకు, సమాజానికి తీరనిదని పలువురు సీనియర్ పాత్రికేయులు అన్నారు.శనివారం నంద్యాల పట్టణంలోని ఏపీ ఎన్ జి ఓ అసోసియేషన్ కార్యాలయంలో జర్నలిస్ట్ సంఘాలకు అతీతంగా ఏర్పాటు చేసిన మాదాల శ్రీనివాసులు సంస్మరణ సభలో నంద్యాల పట్టణంలోని జర్నలిస్టులు పాల్గొని ఆయనకు ఘన నివాళ్లు అర్పించారు. సీనియర్ జర్నలిస్ట్ లు ప్రభాకర్ రెడ్డి, శశిశేఖర్ శర్మ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు 12వ వార్డు కౌన్సిలర్ ఆర్యవైశ్య నాయకులు ఖండే శ్యాం సుందర్ లాల్, చలం బాబు, యం. వి.రమణారెడ్డి, రాజకుమార్ రెడ్డి, సూర్య మధు, కంభం సతీష్ తో పాటు ప్రజాశక్తి రిపోర్టర్ మౌలాలి, ఎన్ టి వి నాగప్రసాద్ తదితరులు ముందుగా మాదాల శ్రీనివాసులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారుఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీనియర్ జర్నలిస్ట్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మాదాల శ్రీనివాసులు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. తాను జర్నలిస్ట్ గా వచ్చినప్పుడు తనకు మంచి గుర్తింపు రావడానికి ప్రోత్సహించిన వారిలో మాదాల శ్రీనివాసులు ఒక్కరన్నారు. ఆయనలో ఓర్పు సహనం ఎక్కువని, ఏ అంశం రాసిన చాలా క్లారిటీగా, స్పష్టంగా, సరళంగా వార్త రచన పాఠకులకు అర్థమైయో రీతిలో ఉండేదాన్నారు. మాదాల శ్రీనివాసులు భౌతికంగా మన మధ్య లేకపోవచ్చుకాని ఆయన ఆశయాలు మన మధ్యలోనే ఉన్నాయని, శ్రీనివాసులు లేని లోటు జర్నలిస్ట్ సమాజానికి తీర్చలేనిదని కౌన్సిలర్, సీనియర్ జర్నలిస్ట్ ఏపీ యూ డబ్ల్యూ జే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఖండే శ్యాం సుందర్ లాల్ అన్నారు. తాను కౌన్సిలర్ గా ఇండిపెండెంట్ అభ్యర్థిగా నిలబడినప్పుడు మాదాల శ్రీనివాసులు నైతికంగా ధైర్యాన్ని ఇస్తూ ముందుకు నెట్టేవారన్నారు. ఎప్పుడు కూడా కోపం అనేది ఆయన మోహంలో చూడలేదని ఎప్పుడు చిరునవ్వుతో ఉంటూ అందరిని ఆప్యాయంగా పలుకరించేవారన్నారు.జర్నలిస్ట్ గా ఎలాంటి ఆడంబరాలు లేకుండా సింపుల్ గా ఉండేవారని శ్రీనివాసులు సేవలను శ్యాం సుందర్ లాల్ గుర్తు చేశారు. మాదాల శ్రీనివాసులు సాగించిన పాత్రికేయ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు మాదాల శ్రీనివాసులు కుటుంబానికి జర్నలిస్టులు అండగా ఉంటారని తెలిపారు.రాష్ట్ర మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ తో మాట్లాడి మాదాల శ్రీనివాసులు కు సంబందించిన మెడికల్ బిల్లులు ను సీఎం సహాయ నిధి కింద వచ్చేలా కృషి చేస్తామన్నారు.మరో సీనియర్ జర్నలిస్ట్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షులు శశిశేఖర్ శర్మ మాట్లాడుతూ అందరితో సంఖ్యంగా ఉంటూ ఎవ్వరిని నొప్పించకుండా మాదాల శ్రీనివాసులు ఉండేవరన్నారు. ఇటీవల నే 60 ఏళ్లు దాటినా సీనియర్ జర్నలిస్టులంతా కలుద్దామని అనుకున్నామని అందుకు మాదాల శ్రీనివాసులు ముందుకొచ్చి అందరిని ఏకతాటిపైకి తెచ్చే క్రమంలో మనమధ్య లేకపోవడం జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చలంబాబు మాట్లాడుతూ మాదాల శ్రీనివాసులు తో సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. ఆయన ప్రజాశక్తి లోను, తాను విశాలాంధ్ర పత్రికలో పని చేసే సమయంలో జరిగిన సంఘటనలను గుర్తు చేశారు. నిబద్దత కలిగిన వ్యక్తిగా, విలువలతో జర్నలిజంలో కొనసాగరన్నారు.ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు మధుబాబు మాట్లాడుతూ జర్నలిజం విలువలకు మాదాల శ్రీను అన్నారు. మాదాల శీను చిరునవ్వుతోనే అందరి మన్నలను పొందారున్నారు. ప్రస్తుతం ఉన్న పాత్రికేయులు మాదాల శీను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరికి గౌరవం ఇచ్చి గౌరవం తీసుకోవడం అన్నది మాదాల సేవించి ప్రతి ఒక్కరు నేర్చుకోవాలన్నారు.ప్రజాశక్తి రిపోర్టర్ మౌలాలి మాట్లాడుతూ కలమే ఆయుధంగా పాలకుల విధానాలను ఎండగడుతూ తన చివరి తుది శ్వాస వరకు అనుకున్న లక్ష్యం కోసం నిలబడిన వ్యక్తిగా మాదాల శ్రీనన్న ఉన్నారన్నారు.నిబద్ధత, విలువలకు కట్టుబడి జర్నలిజంలో మచ్చలేకుండా జీవించారన్నారు.ఆయన ఏ సమాజం కోసం పాటుపడ్డారో ఆ ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలని, జర్నలిస్టులు ఐక్యంగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు యం. వి. రమణారెడ్డి మాట్లాడుతూ మాదాల శ్రీనివాసులు ఏపీయూ డబ్ల్యూ జేలో ఉన్న సమయంలో నంద్యాల పట్టణంలో ప్రెస్ క్లబ్ కు మొదటి అధ్యక్షులు గాను ఉండగా తాను కార్యదర్శిగా ఇరువురం కలిసి పని చేసిన జ్ఞాపకాలను గుర్తు చేశారు. కాలక్రమంలో ఏపీ యూ డబ్ల్యూ జే నుండి ఏపీ డబ్ల్యూ జె ఎఫ్ వ్యవస్థాపకుల్లో ఒక్కరుగా ఉన్నప్పటికీ జర్నలిస్టుల ఐక్యత కోసం కృషి చేశారన్నారు. అలాంటి వ్యక్తి మనమధ్యలో లేకపోవడం బాధ కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ప్రజా రిపబ్లిక్ పత్రిక ఎడిటర్ నాగేంద్ర, ఏపీయూడబ్ల్యూజే పట్టణ ట్రెజరర్ అబ్దుల్ మాలిక్ శిల్పా సిటీ కేబుల్ రిపోర్టర్ చార్లెస్, టీవీ 9 సాయివర్మ, బిగ్ న్యూస్ ఛానల్ రిపోర్టర్ రాజశేఖర్, మీడియా ఫొటో గ్రాఫర్ చింతలపల్లి వాసు, జర్నలిస్ట్ లు మాలిక్, అబ్రహం, శివ, అల్లాబకస్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల ఐఎంఏ, కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య సదస్సు

- సదస్సులో ప్రసంగించిన కర్నూలు కిమ్స్ ఆసుపత్రి వైద్యులు - మెదడు,వెన్నెముక శస్త్ర చికిత్సలో ఆధునిక విధానాల పై ప్రసంగించిన న్యూరోసర్జన్ డాక్టర్ సుమంత్ కుమార్

- ఊపిరితిత్తుల వ్యాధుల చికిత్సలో వినూత్న మార్పుల పై ప్రసంగించిన పల్మనాలజీ వైద్యులు డాక్టర్ యశోవర్ధన్, డాక్టర్ చిరంజీవి రెడ్డి

**నంద్యాల ఫిబ్రవరి 28( రిపబ్లిక్ న్యూస్) :**




వైద్య సదస్సులో ప్రసంగిస్తున్న న్యూరో సర్జన్ డాక్టర్ సుమంత్ కుమార్.

భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, కర్నూలు కిమ్స్ ఆసుపత్రి సహకారంతో స్థానిక మధుమణి సమావేశ భవనంలో వైద్య సదస్సు నిర్వహించారు.

నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసరావు అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో జరిగిన ఈ సదస్సులో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, జాతీయఐ.ఎం.ఎ. కేంద్ర కమిటీ సభ్యులు,రాష్ట్ర ఐఎంఏ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ సదస్సు ప్రారంభించారు. కర్నూలు కిమ్స్ ఆసుపత్రి న్యూరో సర్జరీ వైద్యనిపుణులు డాక్టర్ సుమంత్ కుమార్ మెదడు, వెన్నెముక శస్త్ర చికిత్సలలో నూతన విధానాలపై ప్రసంగించగా, ఊపిరితిత్తుల వ్యాధుల చికిత్సలో వినూత్న మార్పులపై కర్నూలు కిమ్స్ ఆసుపత్రి పల్మనాలజీ వైద్యులు డాక్టర్ యశోవర్ధన్, డాక్టర్ చిరంజీవి రెడ్డి మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా ప్రసంగించారు.

డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ వైద్యులు తమ వైద్య పరిజ్ఞానాన్ని నిరంతరం మెరుగుపరుచుకుంటూ, కొత్తగా ఆవిష్కరించిన ఆధునిక వైద్య విధానాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు.

ఈ సందర్భంగా వక్తలను ఐఎంఏ నంద్యాల తరపున జ్ఞాపికలు అందించి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాసరావు,డాక్టర్ మహమ్మద్ రఫీ లతోపాటు ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, నంద్యాల ఐ ఎం ఎ మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి , అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు పాల్గొన్నారు.

## హుసేనాపురం గ్రామ వైసిపి నాయకుడు రామకృష్ణ కుమారుడు వివాహానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాణ్యం మాజీ ఎమ్మెల్యే



**ఓర్వకల్ ప్రతినిధి, ఫిబ్రవరి 28, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**శనివారం రోజునపాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండల పరిధిలో ఉన్న కాల్వబుగ్గ ఆలయంలో హుసేనాపురం గ్రామ వైఎస్ఆర్సిపి నాయకుడు రామకృష్ణ కుమారుడు సుధాకర్,సునీత వారి వివాహానికి ముఖ్య అతిథిగా హాజరై, సందర్భంగా వారి కుటుంబీకులు పెళ్ళికొడుకు కుటుంబీకులు పెళ్లికూతురు కుటుంబీకులు చాలా ఆనందపడ్డారు, వారి కుటుంబీకులతో మాట్లాడి కాటసాని రాంభూపాల్ రెడ్డినూతన వధూవరులను ఆశీర్వదించిన వైయస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి అనంతరం శ్రీ కాల్వబుగ్గ రామేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల నాయకులు,సర్పంచ్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# భూసార పరీక్ష కేంద్రాల ద్వారా రైతులకు సమగ్ర సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా

**నంద్యాల, బ్యూరో ఫిబ్రవరి 28 (రిపబ్లిక్ న్యూస్)**





రైతులకు భూసార పరీక్ష కేంద్రాల ద్వారా అవసరమైన సేవలను సమర్థవంతంగా అందజేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం నంద్యాల పట్టణంలోని పాత మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఉన్న భూసార పరీక్ష కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు కలెక్టర్ వెంట ఉన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూసార పరీక్షల ద్వారా నేలలో ఉన్న పోషకాల లోపాలను గుర్తించి, అవసరమైనంత మేరకే ఎరువులను వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అవసరానికి మించి రసాయన ఎరువులు వినియోగించకుండా ఉండటం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని సూచించారు. ఖరీఫ్ సీజన్లో 22 వేల మట్టి నమూనాలను సేకరించి వాటికి సంబంధించిన సాయిల్ హెల్త్ కార్డులు (మట్టి ఆరోగ్య పరీక్ష కార్డులు) రైతులకు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా వ్యవసాయ మరియు ప్రకృతి వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాల నుండి 20 వేల మట్టి నమూనాలను సేకరించి వారికి కూడా సాయిల్ హెల్త్ కార్డులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 14 వేల మట్టి నమూనాల పరీక్షలు ప్రారంభమైనట్లు తెలియజేస్తూ, మార్చి నెలాఖరులోగా అన్ని నమూనాల పరీక్షలను పూర్తి చేయాలని భూసార పరీక్ష కేంద్ర సిబ్బందికి ఆదేశించారు.భూసార పరీక్ష కేంద్రానికి అవసరమైన మున్సిపల్ తాగునీటిని నిరంతరంగా సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్కు ఆదేశాలు జారీ చేశారు. కేంద్రంలో పరీక్షలు నిర్వహించేందుకు, మట్టి నమూనాలు భద్రపరచేందుకు అదే భవనంలో ఉన్న రెండు గదులను కేటాయించాలని సిబ్బంది కోరగా, మార్కెట్ కమిటీ సెక్రటరీ మరియు ఛైర్మన్తో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే, కేంద్రానికి అవసరమైన విద్యుత్ సదుపాయం, రసాయనాల నిల్వ కోసం అలమారాలు తదితర మౌలిక వసతుల కోసం ప్రతిపాదనలు సమర్పిస్తే వాటిపై తగు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## మహానంది ఆలయ అభివృద్ధికి రూ. 80 లక్షలు విరాళం



**మహానంది, ఫిబ్రవరి 28, (రిపబ్లిక్ న్యూస్)**మహానంది దేవస్థానంలోని శ్రీ కామేశ్వరీ దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి వారి ఆలయాల్లో బ్రాస్ గేట్లు, గ్రిల్స్ ఏర్పాటు కోసం విజయవాడకు చెందిన శ్రీ వైభవి ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ అధినేత డాక్టర్ బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి రూ. 80 లక్షలు విరాళం ఇచ్చేందుకు అంగీకార పత్రం అందించినట్లు ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్వామి, అమ్మవారి దర్శనానికి శనివారం వచ్చిన ఆమె హామీ ఇచ్చినట్లు చెప్పారు. అందులో భాగంగా పనులు ప్రారంభించేందుకు మొదటి విడతగా రూ. 30 లక్షలు చెల్లించారని చెప్పారు. స్వామి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎరమల మధు, వేద పండితులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com